


నిండుకుండలా వెలిగల్లు ప్రాజెక్టు

జల్లడే నయం..!


తూపల్లె సమీపంలో కుడికాలువ నుంచి జల్లెడ మాదిరి కారిపోతున్న నీరు

- వెలిగల్లు నీరు ఏటిపాలు
- లైనింగ్‌లకు నోచుకోని కుడి, ఎడమ కాలువలు
- వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. రైతులకు శాపం
- కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం లభించేనా ?

ఈ ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. సకాలంలో వర్షాలు కురిస్తే పంటలు సాగవుతాయి.. లేదంటే భూములన్నీ బీళ్లుగా దర్శనమిస్తాయి. అందుకే ఈ ప్రాంతంలో ప్రతి నీటి చుక్క ఎంతో విలువైనది. నింగి నుంచి జారిపడే ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టాల్సిందే. నీటిని ఇంత అపురూపంగా చూసుకునే ఈ కరువు గడ్డమీద గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వెలిగల్లు ప్రాంత రైతులకు శాపంగా మారింది. కుడి, ఎడమ కాలువలు లైనింగ్‌కు నోచుకోకపోవడంతో నీరు అంతా ఏటి పాలవుతోంది. ఫలితంగా వేలాది ఎకరాల వ్యవసాయ భూములు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా వెలిగల్లు కాలువకు మోక్షం లభిస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గాలివీడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కరువు కాటకాలకు నిలయమైన గాలివీడు మండల కేంద్రానికి సమీపంలో పాపాఘ్ని నదిపై 2008లో వెలిగల్లు ప్రాజెక్టు నిర్మించారు. 4.64 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల రైతులకు గుండెకాయ లాంటిది. దీని నిర్మాణం కోసం ఎందరో రైతులు తమ భూములను త్యాగం చేశారు. కానీ రైతులకు కలుగుతున్న ప్రయోజనం అంతంత మాత్రమే. ఈ ప్రాజెక్టు కుడికాలువ 58 కి.మీ. పరిధిలో 23,400 ఎకరాలు సాగు భూమి, ఎడమ కాలువ 10 కి.మీ. పరిధిలో 600 ఎకరాలు, మొత్తం ఉపకాలువల కింద 24 వేల ఎకరాల ఆయకట్టు కలదు. ఇదిలా వుండగా గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రాజెక్టులో ఉన్న నీటిని కూడా రైతులు ఉపయోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. దీనికంతటికి ప్రధాన కుడి, ఎడమ కాలువలకు లైనింగ్ లేకపోవడమే కారణమని చెప్పవచ్చు. నీరు ఏటి పాలు అవుతుండడంతో వేలాది ఎకరాల వ్యవసాయ భూములు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి.

నీళ్లన్నీ ఏటిపాలు

గత కొన్నేళ్లుగా వెలిగల్లు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుతోంది. కానీ నాటి వైసీపీ ప్రభుత్వం వెలిగల్లు ప్రాజెక్టు కాలువల మరమ్మతులను పూర్తిగా నిర్లక్ష్యం


లైనింగులకు నోచుకోని కుడికాలువ

చేయడం వల్ల కాలువల్లో నీళ్లు సక్రమంగా పారే పరిస్థితి లేదు. గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్న కుడికాలువకు కేవలం 58 కి.మీ. గానూ 15 కి.మీ. మాత్రమే లైనింగ్ చేశారు. మిగతా కాలువకు లైనింగ్ వేయకపోవడం వల్ల నీరంతా జల్లెడ మాదిరి వృథాగా పోతోంది. ముఖ్యంగా పందికుంట, కొర్లకుంట గ్రామాల పరిధిలో అటవీ ప్రాంతంలో వెళుతున్న కాలువ ఎక్కడ చూసినా రంధ్రాలు పడింది. వెలిగల్లు ప్రాజెక్టులోని నీటి నిల్వలను దృష్టిలో పెట్టుకొని ఆయకట్టు పరిధిలోని చెరువులను, కుంటలను నింపేందుకు నీటిని విడుదల చేశారు. గాలివీడు మండలంలోని కుడికాలువ కింద ఉన్న చెరువులు పూర్తిగా నిండాయి. 40 రోజులుగా కాలువ గుండా నీరు వెళుతున్నప్పటికీ ఇంతవరకు లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో ఆయకట్టు భూములకు నీరు చేరుకోలేదు. కాలువలకు వదిలిన నీటిలో 25 శాతం నీరు కూడా చివరి ఆయకట్టుకు చేరుకోదని రైతులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని పిల్లకాలువలు

వెలిగల్లు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద 140 కి.మీ. పిల్ల కాలువలు కలవు. ఈ కాలువలు మట్టి, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. వీటి గుండా నీళ్లు సక్రమంగా పారే పరిస్థితి లేదని రైతులు పేర్కొన్నారు. ప్రధాన కాలువల ద్వారా కొంత మేర భూమి మాత్రమే సాగులోకి వస్తుందని, పిల్లకాలువల కింద అధిక మొత్తంలో సాగుభూమి ఉందన్నారు. పిల్ల కాలువలను కూడా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కొన్ని కాలువలు పూడిపోయాయని, మరికొన్ని కాలువలు దెబ్బతిన్నాయని తెలిపారు.

బీడుగా వ్యవసాయ భూములు

వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువకు లైనింగ్ వేయకపోవడం వల్ల కాలువలకు మరమ్మతులు చేయకపోవడం వల్ల కాలువల్లో సక్రమంగా నీరు పారే పరిస్థితి లేదు. తద్వారా వ్యవసాయ భూములన్నీ బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన కాలువలు పిల్ల కాలువల కింద భూములన్నీ సాగులోకి వచ్చేవి.

పిల్ల కాలువలకు మరమ్మతులు చేయాలి



వెలిగల్లు కుడి, ఎడమ కాలువల కింద 140 కి.మీ. పిల్ల కాలువలు కలవు. ఈ కాలువలు 50 శాతం మేర మట్టితో పూడిపోయాయి. మరికొన్ని కాలువలు కంపచెట్లతో నిండిపోయాయి. ఈ పిల్ల కాలువల గుండా ప్రస్తుతం నీరు పారే పరిస్థితి సక్రమంగా లేదు. అయితే ఈ కాలువల కింద అధిక విస్తీర్ణంలో సాగుభూమి వున్నందున ప్రభుత్వం పిల్ల కాలువలపై దృష్టి సారించి వీటిని శుభ్రం చేస్తే బాగుంటుంది.

- మహేశ్వర్‌రెడ్డి, రైతు, పందికుంట

వెలిగల్లు ప్రాజెక్టు ఎడమ కాలువ వెలిగల్లు తూముకుంట గ్రామాల పరిధిలో 10 కి.మీ. వరకు కలదు. ఈ కాలువ కూడా లైనింగ్‌కు నోచుకోకపోవడం వల్ల నీరు వృథా అవుతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం వెలిగల్లు ప్రాజెక్టు కాలువలపై దృష్టి సారించి నీటి వృథాను అరికట్టాలని పలువురు రైతులు పేర్కొన్నారు.

లైనింగ్ పూర్తితో అడ్డుకట్ట

వెలిగల్లు కుడికాలువకు లైనింగ్ లేకపోవడం వల్ల నీరంతా వృథాగా ఏటిలోకి చేరుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కాలువలను పట్టించుకోకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడింది. పందికుంట, కొర్లకుంట గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంలో వెళుతున్న కాలువ కింద ఎక్కువగా నీరు వృథా అవుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెలిగల్లు కాలువలకు లైనింగ్‌ను ఏర్పాటు చేస్తే నీటి వృథాను అరికట్టవచ్చని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేద్దాం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా నూతన పోలింగ్ కేంద్రాలు, కేంద్రాల మార్పులు, చేర్పులపై ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేద్దామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్-2026 పోలింగ్‌స్టేషన్ల హేతుబద్ధీకరణ అంశంపై అన్ని నియోజకవర్గాల ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నిశాంత్‌కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, జిల్లాలో 6-1-2025 నాటికి ఉన్న ఓటర్ల సంఖ్య, ఇందులో రాజంపేట, కోడూరు, రాయచోటి, తంబళ్లపల్లి, మదనపల్లిలో ప్రస్తుతమున్న పోలింగ్ కేంద్రాల సంఖ్యను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 మంది ఓటర్లు ఉండే విధంగా, రెండు కి.మీ. లోపు, ఓటింగ్‌లో అన్ని మౌలిక సదుపాయాలతో భవనాలు వీలైనంతవరకు కింద వుండే విధంగా చూడాలని సూచించారు. మదనపల్లెలో పోలింగ్ కేంద్రాలు 65, రాజంపేట 32, కోడూరు 24, రాయచోటి 32, తంబళ్లపల్లె 32, పీలేరు 2 ఇలా ప్రతిపాదనలు పంపించారని, ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి పంపడం మొదటి సారి చూస్తున్నానని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించి కరెంటు, తాగునీరు, టాయిలెట్స్, టేబుల్స్ లోటు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు హెచ్ఎస్ భావన, చల్లా కల్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి, రాజంపేట, కోడూరు, తంబళ్లపల్లె, మదనపల్లె తహసీల్దార్లు, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనేయులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు : ఎస్పీ



రాయచోటిటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, ప్రజల భద్రతను పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు ద్విచక్ర వాహనాలు గానీ, ఇతర మోటారు వాహనాలను ఇవ్వరాదని, వారి భద్రతకు, పౌరుల రక్షణకు ఇది చాలా ముఖ్యమన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, సంరక్షకులు, వాహన యజమానులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అంతేగాక ఈ నిబంధనలను ఉల్లఘించిన వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేసేలా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, సంరక్షకులు బాధ్యతగా వ్యవహరించి తమ పిల్లలు రోడ్డుపైకి వచ్చి ప్రమాదాల భారిన పడకుండా ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో పోలీసుశాఖకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

చేపల వేటకు వెళ్లి మృత్యులోకాలకు

- గుంజనేరులో ఇద్దరు మృతి


మృతిచెందిన శ్రీనివాసులు, మల్లికార్జున

పెనగలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతిచెందిన విషాదకర సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని నడిమి సిద్దవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు(45), దుగ్గబోయిన మల్లికార్జున(35), కోనేటి సుబ్బనరసయ్యలు మంగళవారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లారు. సింగనమల - ఈటమాపురం మధ్యలో చుట్టూ తిరిగి తిరుణంపల్లెకు చేరుకున్నారు. నదిలో సిరివరం, తిరుణంపల్లె వాసులు ఏర్పాటు చేసుకున్న మట్టిరోడ్డుపై నడుచుకుంటూ నీళ్లలో దిగారు. ఈ క్రమంలో ఈతరాని శ్రీనివాసులు నీటిలో కూరుకుపోతుండగా గట్టిగా కేకలు వేశాడు. పక్కనే ఉన్న మల్లికార్జున కాపాడే ప్రయత్నం చేస్తుండగా.. భయంతో శ్రీనివాసులు గట్టిగా పట్టుకోవడంతో ఆయన కూడా నీటిలో మునిగిపోయాడు. దీంతో అక్కడే ఉన్న కోనేటి సుబ్బనరసయ్య భయంతో పరుగులు తీసి కేకలు వేశాడు. వెంటనే సమీప పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్న తిరుణంపల్లె వాసులు వచ్చి వారిని బయటకు తీయగా, అంతలోనే వారు మృతిచెందినట్లు తెలిపారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ మృతదేహాలను పరిశీలించారు. మల్లికార్జున భార్య నాగవేణి, శ్రీనివాసులు భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాముడు తెలిపారు. కాగా మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రూ.100 కోట్లతో హైవే పనుల పునరుద్ధరణ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్


విలేకరులతో మాట్లాడుతున్న సాయిలోకేశ్‌కుమార్

రాజంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పూర్తిగా దెబ్బతిన్న కడప - రేణిగుంట 716 నేషనల్ హైవే రోడ్డు పునరుద్ధరణ పనులను బుధవారం రూ.100 కోట్లతో ప్రారంభిస్తామని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం రాత్రి రాజంపేటలోని బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల తాను, రైల్వే కోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి కడప - రేణిగుంట హైవే రోడ్డు దుస్థితిని వివరించినట్లు తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ లభించనందున కొన్ని సాంకేతిక కారణాల వల్ల రెండేళ్లుగా కడప - రేణిగుంట నాలుగు లైన్ల రోడ్డు ఆలస్యం జరుగుతోందన్నారు. నాలుగు లైన్ల రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరగా అటవీ అనుమతులు లభించిన వెంటనే రూ.3600 కోట్లతో 122 కి.మీ. మేర పనులు ప్రారంభిస్తామన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు క్రిష్ణయాదవ్, సురేష్‌రాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నదీ స్నానాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- దేవాలయాల్లోకి వెళ్లే భక్తులు క్యూలైన్ తప్పక పాటించాలి
- ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

6

హార్సిలీహిల్స్‌లో హాయిగా.. చల్లగా...

- కొండను కమ్మేసిన పొగమంచు
- పర్యాటకులకు కనువిందు

6



జిల్లా మార్పు ఊహాగానమే...!

- అటువంటి ఆలోచనే ప్రభుత్వానికి లేదు
- రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో రెవెన్యూ రికార్డుల తారుమారు
- వైసీపీ నాయకుల పాపాలే అందుకు కారణం
- డీఆర్‌సీ సమావేశంలో ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

రాయచోటి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'అన్నమయ్య జిల్లాను తీసేస్తామని కూటమి ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదు. జిల్లాను తీసేస్తారంటూ కొందరు ఊహాగానాలతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. జిల్లాల విభజనపై మంత్రివర్గ ఉపసంఘంలో తాను కూడా సభ్యుడినే. ఇప్పటి వరకు అన్నమయ్య జిల్లా మార్పు ఆలోచన ప్రభుత్వానికి లేదు' అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ భవనంలో మంగళవారం జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కనుబిల్లి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ జగన్మోహన్‌రాజుతో పాటు అన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం బీసీ జనార్దన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జిల్లాను ప్రజల ఆశల మేరకు అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోతే నేడు మళ్లీ తాము పూర్వవైభవం తెస్తున్నామన్నారు. గతంలో రోడ్లపై కనీసం ఒక తట్ట మట్టి వేయలేని పరిస్థితి ఉండేదని, నేడు సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల ద్వారా గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తున్నామని తెలిపారు. జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.100 కోట్ల నిధులు ఖర్చు చేసి గుంతల రహిత రహదారుల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్య పరిష్కరించడంలో కలెక్టర్, ఎస్పీలు సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కొందరు నాయకులు తమ కుటుంబాల స్వార్థం కోసం అనేక రెవెన్యూ సమస్యలు సృష్టించారని, ఆ నాయకుల ఒత్తిడికి తలొగ్గిన కొందరు అధికారులు భూముల రికార్డులు తారుమారు చేశారన్నారు. ఆ నాయకుల పాపాలే రెవెన్యూ రికార్డుల తారుమారుకు కారణమన్నారు. ఒక రాజకీయ నాయకుడు, ఆయన కుటుంబం, అనుచరుల పేరుతో దాదాపు 100 ఎకరాల రికార్డులు తారుమారు చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆ నాయకులు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న అంశాలపై ఇప్పటికే అధికా రులు నివేదిక అందజేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏదైనా విపత్తు వస్తే సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పజెప్పి క్షేత్రస్థాయిలో పర్యటించమంటున్నారని తెలిపారు. ఇటీవల మొంథా తుఫాను వచ్చినప్పుడు అర్ధరాత్రి 2 గంటల వరకు సీఎం సచివాలయంలోనే ఉండి పర్యవేక్షించారన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రైతులు, భూయజమానుల నుంచి వచ్చే రెవెన్యూ సమస్యల విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై మండల స్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఏదైనా సమస్య రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సి ఉంటే స్వయంగా సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

భూగర్భ జలాల పెరుగుదలపై కలెక్టర్‌కు అభినందనలు

అంతకుమునుపు జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రులిద్దరూ కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను అభినందించారు. సీఎం సూచనల మేరకు గత నెలలో సాగునీటి శాఖ పూర్తిస్థాయిలో చెరువులు నింపే కార్యక్రమం చేపట్టింది. దీంతో 3.4 మీటర్ల మేరకు భూగర్భ జలాలు పెరిగాయి. ఈ విషయమై మంత్రులిరువురు కలెక్టర్‌ను అభినందించారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై మనసు పెట్టండి

- మున్సిపాలిటీకి 35 ఎలక్ట్రికల్ వాహనాలు
- కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పట్టాభిరామ్, చిత్రంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రను మొక్కుబడిగా కాకుండా మనసుపెట్టి నిర్వహించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ పేర్కొన్నారు. అప్పుడే పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సీఎస్ఐ కమ్యూనిటీ హాలులో మంగళవారం సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో చెత్త సేకరణ, నిర్వహణపై చైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర నిర్వహణలో మదనపల్లె మున్సిపాలిటీ రాష్ట్రంలో 17వ స్థానంలో, దేశంలో 708 స్థానంలో ఉందన్నారు. రానున్న రోజుల్లో ఆ స్థానం రాష్ట్రంలో 15వ స్థానానికి లోపు, దేశంలో ఆ ర్యాంకు 500 స్థానం కంటే తక్కువగా ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆ స్థాయికి చేరుకునేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాటిని తమకూ తెలపాలని చైర్మన్, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలను ఆదేశించారు. ఇక్కడి మున్సిపాలిటీకి రెండునెలల్లో 35 ఎలక్ట్రికల్ వాహనాలను మంజూరు చేస్తామని, తద్వారా మ్యాన్‌పవర్ తగ్గడంతో పాటు ఇంధన వినియోగం కూడా ఆదా అవుతుందన్నారు. అదేవిధంగా స్వచ్ఛ సర్వేక్షన్ క్షేత్రస్థాయిలో అంతా బాగుందని చెప్పాల్సిన పనిలేదని, అందులో ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలను కూడా తమ దృష్టికి తేవాలన్నారు. తిరిగి వాటిని ఎలా అధిగమించాలో సూచనలు చేస్తామని, మీరిచ్చే ఫీడ్‌బ్యాక్‌ను బట్టే ఉంటుందన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ శానిటేషన్ సక్రమంగా ఉంటేనే మన ప్రాంతాలు, మనపరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర చైర్మన్‌ను ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్డీ నాగరాజు, చిత్తూరు, పుంగనూరు, బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్లు నరసింహప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, డీఎల్‌పీవో నాగరాజు పాల్గొన్నారు.

కక్షా రాజకీయాలకు దూరంగా పాలన

- ప్రతీకార రాజకీయాలకు చంద్రబాబు వ్యతిరేకం
- కష్టపడి పనిచేస్తే మళ్లీ అధికారంలోకి వస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

రాయచోటి - నేతాజీ సర్కిల్ , నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కక్ష పూరిత రాజకీయాలకు దూరంగా ప్రభుత్వ పాలన సాగుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో రాయచోటి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసులు పెట్టించుకున్నాం. జైళ్లకు వెళ్లాం. కష్టాలు, ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నామన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చట్టం పరిధిలోనే పోరాడుదామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు పార్టీ కోసం కష్టపడిన వారు అధికారం వచ్చాక తగిన గుర్తింపు కోరుకోవడం సహజమని, అలాంటి వారిని పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. కొంత ఆలస్యం కావచ్చు తప్ప.. అందరికీ తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలియజేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన 90 శాతం పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో అభివృద్ధిని తీసుకొచ్చాం. పరిశ్రమలు రాబోతున్నాయి. పరిశ్రమలు వస్తేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడవలు, బల ప్రదర్శన కంటే, సంక్షేమకార్యక్రమాలు, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు. రామ్‌గోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేసిన సమయంలో అప్పటి అధికార పక్షం చేసిన తప్పులను ప్రజల ముందు ఉంచడం ద్వారానే విజయం సాధించినట్లు తెలిపారు. ప్రతిపక్షం మాదిరిగా మనకు సొంత చానల్, పత్రిక లేవన్నారు. కార్యకర్తల ద్వారా మౌత్ పబ్లిసిటీ ద్వారానే ప్రజల్లోకి మనం చేసిన కార్యక్రమాలు తీసుకెళ్లాలన్నారు. తెలుగుదేశం పార్టీలోకి ఎంత పెద్ద నాయకులు వచ్చినా, పోయినా, కేవలం క్షేత్రస్థాయి కార్యకర్తలు మాత్రమే శాశ్వతం అన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రతిపక్షంలో డైనమిక్‌గా ఉండటంతో పాటు పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పోరాటం చేసిన వ్యక్తి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించే విధంగా పనిచేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ

డీఆర్సీ సమావేశానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో స్వాగతం పలికారు. అనంతరం స్టేట్ గెస్ట్ హౌస్‌లో పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

డ్రైవింగ్ శిక్షణకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ కోసం అన్నమయ్య జిల్లా అభ్యర్థులకు కడపలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి నేతృత్వంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జీవనోపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ మోటరువాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 12 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఎటువంటి పారితోషికం ఉండదన్నారు. శిక్షణ ఇచ్చినందుకు అభ్యర్థి తరఫున ప్రభుత్వం ఆర్టీసీ రూ.20 వేలు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టరు సుబ్బరాయుడు, ప్రజా ట్రాన్స్‌పోర్టు శాఖ (ఆర్టీసీ) అధికారి బాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాకిన మత్తు.. !

- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

గుర్రంకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ హైస్కూల్ విద్యార్థులు మత్తు పదార్థాలతో హెచ్‌ఎంకు పట్టుబడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆరుగురు టెన్త్ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో మత్తు పదార్థాలు సేవిస్తుండగా ప్రధానోపాధ్యాయుడు వారిని పట్టుకున్నారు. కార్యాలయంలోకి పిలిపించుకుని విచారణ చేయగా, తాము గంజాయిని సేవించలేదని, సొల్యూషన్ వాడినట్లు తెలిపారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా, అప్పటికే సాయంత్రం కావడంతో పోలీసులు మరుసటి రోజు రావాలంటూ ఇళ్లకు పంపేశారు. నాలుగు నెలల క్రితం కూడా ఇదే ప్రాంగణంలో ఓ విద్యార్థి మత్తు పదార్థాలను సేవిస్తూ ఉపాధ్యాయులకు పట్టుబడ్డాడు. అప్పట్లో విషయం బయటకు రాకుండా నొక్కిపెట్టారు. కాగా, మంగళవారం పోలీసులు, హెచ్‌ఎం కలిసి విద్యార్థులకు మత్తు పదార్థాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ విషయమై ఏఎస్‌ఐ బొజ్జినాయక్ వివరణ కోరగా హెచ్‌ఎం తీసుకొచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. తల్లిదండ్రులను తీసుకురావాలని విద్యార్థులకు చెప్పి పంపాము. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులకు తెలిపి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

రాజంపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఊటుకూరు గ్రామానికి చెందిన కార్తికేయరాజు(32) అనే వ్యక్తి విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కార్తికేయరాజు రాజంపేట పట్టణంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తుంటాడు. సోమవారం రాత్రి ఊటుకూరు పొలాల్లో విషం తాగాడు, అపస్మారక స్థితిలో ఉన్న కార్తికేయరాజును గుర్తించిన స్నేహితులు, స్థానికులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆర్థిక కారణాలే అతని ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చునని స్థానికులు చెబుతున్నారు. రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

మద్యం దుకాణంలో యువకుడి మృతి


నరేశ్ మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగుతూ.. నరేశ్ (28) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని పోతులప్ప వీధికి చెందిన నాగరాజు, పద్మజ దంపతుల కు మారుడు నరేశ్ సెంట్రింగ్ పనులు చేసేవాడు. మద్యానికి బానిసైన ఇతను మంగళవారం పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగుతూ అక్కడే పడి పోయాడు. ఎంత సేపటికీ అతను కదలక పోవడం గమనించిన స్థాని కులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి తమ బృందం తో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నా భర్త మృతి అనుమానాస్పదం

- ఎస్పీకి ఓ మహిళ ఫిర్యాదు ● పోస్టుమార్టంకు డిమాండ్


మృతుడి భార్య శ్రీదేవితో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

రాయచోటి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భర్త మృతదేహాన్ని భార్యకు చూపకుండానే బంధువులు అంత్యక్రియలు నిర్వహించ డంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రవిశంకర్, జి ల్లా సహాయ కార్యదర్శి ఎం. రవిశంకర్ అన్నారు. పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలం నూతన కాల్వ పంచాయతీ దేవవాండ్ల పల్లెకు చెందిన దేరంగుల అంజనేయులు (28) భార్య ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. మూడు రోజుల క్రితం భర్త అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందడంతో ఈ నెల 2న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని భార్య శ్రీదేవి అతనిని చూసేందుకు గ్రామానికి వచ్చింది. అయితే, అప్పటికే ఆంజ నేయులు మృతి చెందడంతో అంత్యక్రియలకుసిద్ధం చేసిన బంధు వులు మృతదేహాన్ని చూసేందుకు సైతం ఆమెను అనుమతించలేదు. ఈ విషయంపై ఆమె సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మంగళ వారం పౌరహక్కుల నాయకులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయులు మృతిపై అను మానాలు వ్యక్తమవుతున్నందున పోస్టుమార్టం చేయించాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా కీడా జట్ల ఎంపిక


చెస్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలిక జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అండర్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 14, అథ్లెటిక్స్, అండర్ 14, 17, 19 చెస్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 360 మంది క్రీడాకారులు హాజరు కాగా, ప్రతిభ కనపర్చిన వారిని ఎంపిక చేశారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో అండర్ 14, 17, 19 చెస్ చాంపియన్‌షిప్ పోటీలో ఈ జట్లు పాల్గొంటాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజ తెలిపారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు అన్సర్, అంజనప్ప, దిలీప్, భారతి, సుధాకర్, మోహన్, కరేశ్, కిరణ్, మురళీధర్, హరి, లత, వరలక్ష్మి, డివిజన్ స్థాయి కో-ఆర్డినేటర్స్ భద్రయ్య, సుధాకర్,బాటాజీ, దేవకమ్మలు పాల్గొన్నారు.

నదుల వద్ద జాగ్రత్తగా ఉండాలి

- దేవాలయాల్లో క్యూలైన్ పాటించాలి ● ప్రజలకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచన

రాయచోటిటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నమయ్య జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం ఒకప్రకటనలో కోరారు. నదీ స్నానాలు, దేవాలయాల సందర్శనల విషయంలో భక్తులు తప్పక పాటించాల్సిన నియమాలను ఎస్పీ విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా నదుల్లో ప్రవాహం ఉధృతంగా ఉందని, లోతు తక్కువ ఉన్న సురక్షిత ప్రాంతంలోనే స్నానం చేయాలన్నారు. సుడులు, ప్రమాదకర లోతు ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు. మహిళలు, భక్తులు ఒడ్డున నిలబడి మాత్రమే దీపాలు వదలాలని, గట్టు జారే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా నడవాలన్నారు. పిల్లలను ఒక్క క్షణం కూడా ఒంటరిగా వదలవద్దని, వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు నిశితంగా గమనించాలన్నారు. నదులు, దేవాలయాల వద్ద మీ భద్రత కోసం ఉన్న పోలీసుల సూచనలను తప్పక పాటించాలన్నారు. రద్దీగా ఉండే ఆలయాలు, ఘాట్ల వద్ద తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా క్రమశిక్షణతో క్యూలైన్లలో మాత్రమే వెళ్లాలని, గుంపులుగా వెళ్లవద్దన్నారు. పూజలు నిర్వహించే సమయంలో షార్ట్ సర్క్యూట్‌లు, దీపాల వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి ఇసుక, నీటిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అత్యవసర సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని పేర్కొన్నారు.

గైడ్ కెప్టెన్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ కే. సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలపై ఇచ్చే శిక్షణను గైడ్ కెప్టెన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం సూచించారు. రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన బేసిక్ గైడ్ కెప్టెన్ల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం స్కౌట్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై విద్యార్థులకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని, సేవా భావాన్ని, నైతిక విలువలను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధాకర్, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్ సుజాత, జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన 55 మంది బేసిక్ గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం


ఐసీడీఎస్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం

మదనపల్లె టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రొఖియా బేగం తెలిపారు. మంగళవారం మదనపల్లెకు వచ్చిన ఆమె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. పౌష్టికాహారం నివేదికలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాల వివరాలను మహిళా కమిషన్‌కు పంపాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లతో పలు అంశాలను చర్చించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగవేణి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు సమాజంలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే ధైర్యంగా టోల్‌ఫ్రీ నెంబర్‌కు, శక్తియాప్ ద్వారా పోలీసులకు తమకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం చంద్రాకాలనీలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వంటశాలలో కూరలను పరిశీలించారు. కోడిగుడ్ల బండి వద్ద విద్యార్థినులు ఉండటాన్ని చూసి ప్రిన్సిపాల్ మల్లీశ్వరిని ప్రశ్నించారు. స్కూల్ కమిటీలో విద్యార్థినులు సభ్యులుగా ఉన్నారని, అందుకే 8, 9 తరగతులు విద్యార్థినులు కోడిగుడ్ల లెక్కలను సరి చూస్తున్నారని అక్కడి అధ్యాపకులు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య, క్రీడల్లో ప్రోత్సాహం ఇవ్వాలని మహిళా కమిషన్ సభ్యురాలు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం వచ్చి మృత్యువాత..

- ఆందోళనతో గుండెపోటుకు గురై వృద్ధుడి మృతి


చంద్రారెడ్డి మృతదేహం

పీలేరు, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): భూతగాదాల నేపథ్యంలో న్యాయం కోసం పోలీసు స్టేషన్, తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన కూరపర్తివారిపల్లెకు చెందిన ఇట్లం చంద్రారెడ్డి(70) అనే వృద్ధుడు పోలీసు స్టేషన్ ఎదుటే మృత్యువాతపడిన సంఘటన మంగళవారం పీలేరులో చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు వెంకటేశ్వరరెడ్డి కథనం మేరకు .. చంద్రారెడ్డి కుటుంబానికి రేగళ్ల పంచాయతీ పరిధిలోని సర్వే నెం 284లో 2.96 ఎకరాల పొలం ఉంది. ఈ పొలం విషయంలో శెట్టిపల్లె హరిజనవాడకు చెందిన గంగారపు గంగయ్య, గంగారపు వెంకటేశు మధ్య వ్యాజ్యం నడవగా, పీలేరు సివిల్‌జడ్జి కోర్టు చంద్రారెడ్డి కుటుంబానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గత నెల29, 30 తేదీల్లో తమ పొలంలో ఉలవలు చల్లేందుకు ప్రత్యర్థులు చేసిన ప్రయత్నాలను అడ్డుకుని, పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో విచారణ నిమిత్తం మంగళవారం పోలీసు స్టేషన్ వద్దకు వస్తున్న చంద్రారెడ్డి, కుటుంబ సభ్యులపై ఎదుటి వర్గం వారు దౌర్జన్యం చేశారు. దీంతో ఆందోళనకు గురైన తన తండ్రి కుప్పకూలిపోయాడని, వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంకటేశ్వరరెడ్డి మంగళవారం సాయంత్రం తన ఫిర్యాదు వాపసు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి

గండి క్షేత్రంలో ప్రత్యక్షం

- సోషల్ మీడియా చిత్రాల ఆధారంగా గుర్తించిన భక్తులు


విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తంబళ్లపల్లె/రాయచోటి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు మందలిస్తారనే భయంతో నాలుగు రోజుల క్రితం తంబళ్లపల్లె గిరిజన బాలుర గురుకుల పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. . అక్టోబరు 31 తెల్లవారుజామునుంచి విద్యార్థి కనిపించడం లేదంటూ తల్లితండ్రుల ఫిర్యాదు చేయడంలో తంబళ్లపల్లె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ వెంకటేశులు, ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలతో గాలించడంతోపాటు, సీసీ కెమెరాల ఫుటేజీల పరిశీలన, విద్యార్థి ఫొటోలతో కూడిన కరపత్రాలను సోషల్ మీడియా, సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. మంగళవారం కడప జిల్లా వేంపల్లి గండి ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లిన ఓ భక్తుడు సామాజిక మాధ్యమంలో చూసిన పోలికలతో ఓ బాలుడు ఆలయం వద్ద ఒంటరిగా తిరుగుతుండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని విద్యార్థి చరణ్‌ను సురక్షితంగా పట్టుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచుకోవాలి

- పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ విజయభాస్కర్


చూడి ఆవుకు పరీక్షలు చేస్తున్న వైద్యులు


రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచుకోవాలని రాజంపేట పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కేఆర్‌కండ్రికలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 253 పశువులకు గాను చూడి, సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దూడలకు నట్టల నివారణ మందుల వేశామన్నారు. పిడుదుల మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కేఆర్‌కండ్రిక, అమ్మిశెట్టిపల్లె, చియ్యవరం, కమ్మపల్లె, నడింపల్లె, వెంకటరెడ్డిపల్లె తదితర గ్రామాలకు చెందిన 55 మంది పాడి రైతులకు రూ. 20 వేలు విలువ చేసే మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌రాజు, కడప పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ శివరామిరెడ్డి, పశువైద్యులు దుర్గానాగమ్మ, డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ నాగశిరీషా, డాక్టర్ సృజన, పాడి రైతులు శ్రీనివాసరాజు, మద్దిన గిరిబాబు, మండల పశుసంవర్ధక శాఖ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 69వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 1, 2 తేదీల్లో ఏలూరు లోని శనివారంపేట హైస్కూలు మైదానంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో రైల్వేకోడూరు జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థిని అఖిల బంగారు పతకాన్ని సాధించి, జాతీ య స్థాయి పోటీలకు ఎంపిక కాగా, మంగంపేట జడ్పీ హైస్కూలు విద్యార్థి ఏ. రామ్‌చరణ్ కాంస్య పతకాన్ని సాధించాడని ఎస్‌వీకే స్పోర్ట్స్ అకాడమి కోచ్ శివాజీ తెలిపారు. అఖిల ఈ నెల 25న అరుణాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థులను రైల్వేకోడూరు రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు అభినందించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి


తరగతి గదిలో మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

సుండుపల్లె, నవంబరు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్న త లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని జేడీఏ శివనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని రాయవరం ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, వసతులు, విద్యార్థుల సమస్యలు , 9, 10 తరగతుల సిలబస్ ఏ మేరకు పూర్తి చేశారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోందని, అందుకు అనుగుణంగా రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. యూనిట్ టెస్టులు, వాటి ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అమృనాయక్ పాల్గొన్నారు.

నిధులు తెచ్చుకోవడంలో ప్రభుత్వం విఫలం

- తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడంలో కూటమి ప్రభుత్వం, గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. రాజధాని నిర్మాణం పేరుతో విచ్చలవిడిగా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చవద్దని ముఖ్యమంత్రికి ఆయన సూచించారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాజెక్టు సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నోమార్లు చెప్పారన్నారు. కానీ ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం రూ.31వేల కోట్లు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో నుంచి, జర్మనీ బ్యాంకు ద్వారా అప్పు చేశారన్నారు. ఇవి కాకుండా మరో రూ.32,500 కోట్లు అప్పు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం అప్పులు చేయడం మానుకుని కేంద్రప్రభుత్వం ఆర్థిక సహాయం, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో నిర్మించాలని ఆయన సూచించారు.

హార్సిలీహిల్స్‌లో హాయి హాయిగా...

- కొండను కమ్మేసిన పొగమంచు ● పర్యాటకులకు కనువిందు


పొగమంచులో హరిత రెస్టారెంట్ ప్రాంగణం

బి.కొత్తకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని హార్సిలీహిల్స్‌లో మంగళవారం నాటి దృశ్యాలు పర్యాటకులను కట్టిపడేశాయి. సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న హిల్‌స్టేషన్ కావడంతో సహజంగానే చల్లనిగాలులతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు పడే సూచనలుంటే కొండంతా పొగమంచు కమ్ముకుంటుంది. సమీపంలోని మనుషులు, ప్రదేశాలు కనపడనంతగా పొగమంచు ఆవరిస్తుంది. మంగళవారం ఇలాంటి వాతావరణం కొండమీద కనిపించింది. దీంతో కొండపైకి వచ్చిన పర్యాటకులు మంచును, వణికించే చలిని ఆస్వాదిస్తూ గడిపారు. గాలిబండ, కొత్తవ్యూపాయింట్ నుంచి దిగువ ప్రాంతాలు కనపడనంతగా కమ్మేసిన పొగ మంచులో ప్రకృతి అందాలను కెమెరాలలో బంధించారు. చక్కటి అనుభూతిని పొందుతూ కొండపై కలియ తిరిగారు.


దిగువప్రాంతం ఏరియల్ వ్యూపాయింట్

ఎడతెరిపి లేని వర్షం... తీరని నష్టం

నెల రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతున్నారు. మొన్నటి వరకు మొంథా తుఫాను ధాటికి రైతులు విలవిల్లాడారు. ఇప్పుడిప్పుడే ఊపిరి తీసుకుంటున్న పరిస్థితుల్లో తిరిగి వర్షాలు పడుతుండడంతో వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పంటలన్నీ కోత దశకు వచ్చి నూర్పిళ్లు జరుగుతున్న తరుణంలో వర్షాలు పడడంతో చేతికి వచ్చిన పంటలు పొలాల్లోనే దెబ్బతింటున్నాయని తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు.



గుడిపాడు వద్ద వేరుశనగ పొలంలో నిలిచిన వర్షపునీరు



రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న విత్తనాలు



నీరు తొలగించేందుకు రైతు పాట్లు

దువ్వూరు/రాజుపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు, రాజుపాళెం మండలాల్లోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, మినుము, వరి, పత్తి, కంది, వేరుశనగ, పసుపు, ఉల్లి తదితర పంటలను రైతులు సాగు చేశారు. దాదాపు నెల రోజులు ప్రతి రోజు వర్షం పడుతుండడంతో పంటలు సాగు చేసిన పొలాల్లో తేమ శాతం ఎక్కువై పురుగుల బెడదతో పాటు తెగుళ్లు చుట్టుముట్టాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతన్నలు అష్టకష్టాలు పడుతు న్నారు. ఉల్లి రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. చాలా గ్రామాల్లో వర్షానికి తోడు ధర లేకపోవడంతో చేసేది లేక పంటను పొలం లోనే వదిలేశారు. ప్రస్తుతం చిన్న బళ్లారి రకం ఉల్లి సాగు చేసిన రైతులు వర్షాలకు పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ వేసిన రైతుల పొలాల్లో నీరు నిలబడి పైరు కుచించుకుపోతోంది. పసుపు వేసిన రైతుల్లో సైతం వర్షం గుబులు పట్టిస్తోంది. అక్కడక్కడ కాడ తెగుళ్లు సోకుతుండడంతో ఆందోళన రేకెత్తిస్తోంది. కాన గూడూరు, క్రిష్ణంపల్లె ప్రాంతాల్లో పూలతోటలు పాడైపోయా యని రైతులు వాపోతున్నారు. ఇక మొక్కజొన్న దిగుబడులు రోడ్ల పక్కలో ఆరబెట్టిన రైతుల పరిస్థితి సరేసరి. కుప్పల్లో నీరు నిలువడంతో వాటిని తొలగించేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

వరి రైతుల్లో ఆందోళన

● వర్షం భయంతో ముమ్మరంగా వరి కోతలు



మిషన్‌తో వరి కోత కోస్తున్న దృశ్యం



వరిధాన్యం బస్తాలను లారీకి నింపుతున్న కూలీలు

జమ్మలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షం భయంతో పండిన పంట ఎక్కడ దెబ్బతింటుందోననే ఆందోళనతో రైతులు గ్రామాల్లో వరి కోతలు మొదలు పెట్టారు. జమ్మలమడుగు మండలంలోని ధర్మాపురం, దానవులపాడు, గొరిగెనూరు, చలివెందుల, పెద్ద దండ్లూరు, పి.సుగుమంచిపల్లె, అంబవరం, గూడెం చెరువు, అనంతగిరి, పూర్వపు బొమ్మేపల్లె తదితర గ్రామాల్లో ప్రతి ఏడాది రైతులు అధికంగా వరి పంట సాగు చేస్తారు. ధర్మాపురం తదితర గ్రామాల్లో ఇటీవల తుఫాను వలన వరి పంట నేలవాలి దెబ్బతింది. ప్రస్తుతం వర్షం భయంతో చేతికొచ్చిన పంట దెబ్బతింటుందోననే ఆందోళనతో రైతులు మిషన్లతో కోతలు ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో వరి కోతలు ఊపందుకున్నాయి. కాగా, పంట సాగు చేయడానికి ఎకరాకు రూ.35 వేలు ఖర్చు చేశామని, ప్రస్తుతం దిగుబడి ఉన్నా ధర లేదని ఓ రైతు వాపోయాడు. ఎకరాకు 38 బస్తాల నుంచి 42 బస్తాల వరకు వరి దిగుబడి వస్తోందన్నారు. ప్రస్తుతం వరి ధాన్యం 78 కేజీల బస్తా రూ.1400, పుట్టి (10 బస్తాలు) రూ.12వేలతో వ్యాపారస్థులకు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. సాగు కోసం చేసిన పెట్టుబడి, ఖర్చులు అన్ని కలిపితే కష్టాలు తప్ప పెద్దగా మిగలడం లేదంటున్నారు. ప్రభుత్వం గిట్టు బాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

వెల్లాల సంజీవరాయ దేవస్థానానికి భారీ విరాళం



ఆలయ చైర్మన్‌కు విరాళం అందిస్తున్న తిరుపాల్‌రెడ్డి

రాజుపాలెం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ సంజీవరాయస్వామి దేవస్థానానికి మంగళవారం మైలవరం మండలం నవాబుపేట గ్రామానికి చెందిన భూపతి తిరుపాల్‌రెడ్డి రూ.లక్షా 5వేలు విరాళం అందజేశారు. నూతనంగా ఆలయం నిర్మిస్తుండడంతో దాతలు విరాళాలు అందిస్తున్నారని ఉత్సవ కమిటీ చైర్మన్ గంగిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా సంజీవరాయస్వామి సన్నిధిలో దాతను పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో పూజారులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలు దారుణం

ఎర్రగుంట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రయత్నాలు దారుణమని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న పూస సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరుపతిలో మంగళవారం జరిగిన సభకు ఆయన హాజరై ప్రసం గించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయ త్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. భవిషత్తులో ప్రజలపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. విద్యుత్ చార్జీలు పెరిగి వినియోగదారులకు అత్యంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

వాల్మీకులకు రుణాలు మంజూరు చేయాలి

ప్రొద్దుటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కులాల కోసం రుణాలను మంజూరు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ 3 లో భాగంగా 56 కులవృత్తులతో పాటు వాల్మీకులకు కూడా రుణాలు మంజూరు చేయాలని వాల్మీకి బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత ఆధ్వ ర్యంలో జరిగిన సమావేశంలో వాల్మీకులకు రుణాల మంజూరుపై చర్చించినట్లు తెలిపారు. గతంలో వాల్మీకులకు కులవృత్తి కారణంగా రుణాలు మంజూరు చేయలేదన్నారు. వాల్మీకులు వడ్రంగి, వడ్డెర, తదితర వృత్తులలో వున్నారన్నారు. ఈ అంశంపై మంత్రి సవిత స్పందించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారని నాగరాజు వెల్లడించారు.

గూడ్సు రైలుకింద పడి వ్యక్తి మృతి



కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని కనుమలోపల్లి వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి గూడ్సు రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు బ్లూకలర్ చొక్కాపై తెలుపు రంగు గీతలు కలిగిన ఫుల్ షర్టు ధరించి ఉన్నాడు. నలుపు రంగు కలిగిన ఫార్మల్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్‌ఐ 9440900811, సీఐ 9440627398 కు ఫోనుచేసి తెలపాలన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పులివెందుల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో షార్ట్‌సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఫైర్‌స్టేషన్ అధికారుల వివరాల మేరకు మంగళవారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో తమకు సమాచారం అందడంతో అగ్నిమాపక వాహనంతో వెళ్లి మంటలు వ్యాపించిన దుకాణాలను ఆర్పివేశామన్నారు. ఈ ప్రమాదంలో ప్రసాద్ అనే వ్యక్తికి చెందిన ఫర్నీచర్ దుకాణంలోని సామాగ్రి కాలిపోయి రూ.10లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడన్నారు. అలాగే ఫర్నీచర్ షాప్ పక్కనే ఉన్న ఫర్టిలైజర్ దుకాణానికి కూడా మంటలు వ్యాపించడంతో అందులో ఉన్న మందులు, ఇతర సామాగ్రి కాలిపోయి రూ.15లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు యశస్విని తెలిపారన్నారు.

కుప్పగుట్టపల్లెలో వ్యక్తి ఆత్మహత్య



మల్లికార్జున (ఫైల్)

చక్రాయపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి గ్రామం కుప్పగుట్టపల్లెలో పెద్దపోయిన మల్లికార్జున (49) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు వివరాలిలా.. మల్లికార్జున జీపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. అదే సమయంలో వేంపల్లె నుంచి కుప్పగుట్టపల్లెకు మల్లికార్జున జీపులో వెళుతూ హోంగార్డులు నాగరాజు, నరసింహరాజులను ఢీకొట్టి వెళ్లిపోయాడు. దీంతో గాయపడ్డ వారిని కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై పోలీసులు ఆరా తీయడడంతో మల్లికార్జున భయపడి మంగళవారం ఉదయం విషద్రావణం తాగాడు. వెంటనే అతన్ని రాయచోటిలోని ఓ వైద్యశాలకు తరలించగా అక్కడ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దీనిపై చక్రాయపేట ఎస్‌ఐ వివరణ కోరగా.. పోలీసులకు భయపడి చనిపోలేదన్నారు. కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పోస్టుమార్టం చేసి విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. కాగా మల్లి కార్జునకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నారు.

స్కూటర్, కారు ఢీ - ఒకరి మృతి

ఖాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట-కమలాపురం రహదారిలోని సుంకేసుల వద్ద కారు ఢీకొన్న సంఘటనలో వెంకటరెడ్డి (63) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు సోమవారం సాయంత్రం పని నిమిత్తం సుంకేసులకు చెందిన వెంకటరెడ్డి రహదారిలో వస్తుండగా ఖాజీపేట నుంచి కమలాపురం వెళుతున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

మైదుకూరు నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం జీవీ సత్రంలోని సీతారామయ్య నగర్‌లో మంగళవారం బెల్టుషాపు నడుపుతున్నా రన్న సమాచారం రావడంతో దాడి చేసి నిర్వాహకుడు వంగా సీతారామయ్యను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. అతని వద్ద నుంచి 9 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారీ స్కోర్ దిశగా అనంతపురం, నెల్లూరు జట్లు





ఏసీఏ క్రికెట్ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు, 102 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్న మోక్షజ్ఞతేజ్

కడప స్పోర్ట్స్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో మంగళ వారం ఆట ముగిసే సమయానికి అనంత పురం జట్టు కర్నూలు జట్టుపై భారీ స్కోర్ దిశగా సాగుతోంది. అలాగే నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు అదే దారిలో సాగుతోంది. వివరాలిలా.......

కడప నగర శివారు ప్రాంత కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం- కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 45 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 174 పరుగులు చేసింది. ఇందులో ముఖేష్‌మోక్షజ్ఞతేజ్ 102 పరుగులతో, హేమచందర్‌నాయక్ 59 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

నగర రిమ్స్ సమీప వై.యస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 51.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. ఇందులో కిన్నుకిషల్ 77 పరుగులు చేశారు. మరో బ్యాటర్ ఎస్‌కె షామీర్ 26 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

మట్టినమూనాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కొండాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం మట్టినమూనాలపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా మట్టి నమూనాలు మరియు భూసారపరీక్షల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కడప భూసార పరీక్షా కేంద్రం ఏవోలు సాయిజ్యోతి, భారతి, పద్మజలు మట్టి నమూనాల సేకరణ విధానం, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకాన్ని ఎలా వినియో గించుకో వాలో విద్యార్థులకు వివరించారు. ఏవో ఏపీ రామాంజు లరెడ్డి, గురుకుల పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ మాధవి పాల్గొన్నారు.

అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన రెడ్డిబాబు అనే వ్యక్తి మంగళవారం బాలిక ఇంటి దగ్గరకి వచ్చి, ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో ఆ లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపారు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజె క్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం నీటిని నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయిర్ నుంచి పెన్నానది ద్వారా 100 క్యూసెక్కులు, వరద నీరు 100 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.534 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

8న సీబీఐటీ విద్యార్థులకు పేస్ ఎక్సరేషన్ మిషన్

చాపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీబీఐటీ విద్యార్థులకు ఈనెల 8వ తేదీ పేస్ ఎక్సరేషన్ 2025 మిషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రయోగాల గురించి వివరించడం జరుగుతుందన్నారు. 35 మంది విద్యార్థులతో కూడిన డైనమిక్ గ్రూపు 35 కి.మీ. ఎత్తులో ఉండే స్ట్రాటో ఆవరణంలోకి రాకెట్ ప్రయోగంపై శాస్త్రీయ పేలోడ్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వాతావరణం, ఉష్ణోగ్రత, తేమ పీడనం, యూవీ రేడియేషన్, వీపీఎస్ వంటివాటిపై బోధించడం, ప్రయోగాలు నేర్పించడం జరుగుతుందన్నారు.

రోగులకు సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వాలి

● ఆర్‌ఎంపీలకు ఆర్డీఓ, వైద్య అధికారుల ఆదేశాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య, పక్కన డిప్యూటీ డీఎంహెచ్ఓ

పులివెందుల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మీరు ఎంబీబీఎస్ చదవలేదు.. ఆసుపత్రుల్లో పని నేర్చుకొని వచ్చారు. ప్రథమ చికిత్స కేంద్రం అని ఏర్పాటు చేసుకున్నారు.. మీరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగులకు సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొయిద్దీన్, డీఈఎంఓ భారతిలు ఆర్‌ఎంపీలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పులివెందుల, వేంపల్లెలోని ఆర్‌ఎంపీలకు (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రథమ చికిత్స కేంద్రాలలో ఇంజక్షన్లు, మందులు, మాత్రలు ఇవ్వకూడదన్నారు. మంచాలు, ఐవీ స్టాండ్స్, ఆసుపత్రికి సంబంధించిన పరికరాలు ఉండరాదన్నారు. ఆక్సిజన్ నెబులైజర్ ఉపయోగించకూడదన్నారు. అలాగే ప్రథమ చికిత్స కేంద్రాలలో ప్రథమ చికిత్స గాయాలకు కట్టు కట్టుట, వ్యాధులు రాకుండా సలహాలు, సూచనలు, చికిత్సకు వెళ్లాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిని సూచించడం జరుగుతుందనే బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రథమ చికిత్స కేంద్రాల పర్యవేక్షణకు నోడల్ అధికారులు ఉంటారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఆర్‌ఎంపీలు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవచేస్తున్నారనే కోవలో ఎందుకు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో తప్పు జరిగితే అది అందరిపై రుద్దడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ నిబంధ నలకు లోబడి తాము ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని, తమపై దయతలచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రమణ, హెచ్ఈఈఓ రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌తో విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం



సంబేపల్లెలో విజేతలకు మెమెంటో, ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచడం కోసం చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గుజ్జల చక్రపాణి తెలిపారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ భావనలు పెంపొందించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాంటి లక్ష్యంతోనే రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. సంబేపల్లె మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. సంబేపల్లె మోడల్ స్కూల్, శెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు నాగశేషారెడ్డి, రామయ్య, గంగాధర్, బాలాజీ, రాంమోహన్‌రెడ్డి, రెడ్డిశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా చెకుముకి సంబరాలు

సిద్దవటం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రమైన సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్సు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీల్లో మాధవరంలోని హ్యాపీ కిడ్స్ పాఠశాల విద్యార్థులు హాస్మితారెడ్డి, యోగిత, శ్రీదీక్షితారెడ్డి, వెంకటేశ్వరాపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు చక్రధర్, సుధా, కావేరి తమ ప్రతిభను చూపి మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారు. అనంతరం విజేత విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, జేవీవీ అధ్యక్షుడు షామీర్‌బాషా, జేవీవీ రాష్ట్ర సభ్యుడు బాలుగారు వెంకటసుబ్బయ్య, మండల అధ్యక్షుడు రామకేశవ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నందలూరు విద్యార్థినుల ప్రతిభ

నందలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో మహాత్మాజ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సాయిహేమశ్రీ, జాహ్నవి మంజుల మొదటి స్థానం, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దినేష్, వెంకటలక్ష్మి, వాగ్దేవి ద్వితీయ స్థానం, లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వెంకట సంధ్య, అలేఖ్య, సాత్వికరెడ్డి తృతీయ స్థానం సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శామ్యూల్, కిరణ్‌బాబు, కృపానందం, షఫీ, జంగంశెట్టి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్ట్ ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని మండల విద్యాశాఖ అధికారి చక్రే నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను జనవిజ్ఞాన వేదిక కోఆర్డినేటర్ జగదశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో దేవళంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మొదటి స్థానం, ఏపీ మోడల్ స్కూల్ ద్వితీయ స్థానం, అలాగే ప్రైవేటు పాఠశాలల విభాగంలో విశ్వభారతి హైస్కూల్ మొదటి స్థానం, మనీషా హైస్కూల్ ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యుడునాయక్, ప్రధానోపాధ్యాయులు రమేశ్, ఉపాధ్యాయులు రాజా, శ్రీదేవి, విజయలక్ష్మి, వెంకటకృష్ణయ్య, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటో పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఖరీఫ్ పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

రామాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈనెల 10వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి తెలిపారు. మండలంలోని గోపగుడిపల్లి, కల్పనాయునిచెరువు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఉలవలు 80శాతం సబ్సిడీతో అందిస్తామని తెలిపారు. అనంతరం యూరియా వాడకం, వివిధ పంటల్లో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగమణి, కవిత, ఏఈవో, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి పంటలో కాండం తొలుచు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాకారి రమేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఖాజీపల్లె వరి పొలాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నివారణ కోసం ఎకరాకు 10 కిలోల చొప్పున కార్బేన్ గుళికలు పిచికారి చేయాలన్నారు. సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడి కూడా లాభసాటిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఈవో ప్రభాకర్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి ఎన్‌సీసీలో లెఫ్టినెంట్ ర్యాంక్ హోదా



ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ర్యాంక్ హోదాతో డాక్టర్ కిరణ్‌కుమార్

రాయచోటి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్‌కు 30వ ఆంధ్రా బెటాలియన్ కడప కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్. సూర్యనారాయణ మూర్తి ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ర్యాంక్ హోదాను ప్రదానం చేశారు. మూడు సంవత్సరాలుగా కేర్ టేకర్ ఆఫీసర్‌గా ఎన్‌సీసీ విద్యార్థులకు సేవలందిస్తూ డైరెక్ట్ కమిషన్ పొందినందుకు గానూ ఆయనకు ఈ హోదా లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు డాక్టర్ కిరణ్‌కుమార్‌ను కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, తోటి అధ్యాపకులు అభినందించారు.

10న ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

రాజంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 10న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ రామమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీసిటీ కడప, బెంగుళూరుకు చెందిన పరిశ్రమల అధికారులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని, ఆసక్తి గల అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్.ఇండియా.గవర్నమెంట్ అనే పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అప్రెంటిస్‌షిప్ మేళాకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

● ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ సమయంలో పలువురు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడడంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనదారులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి

రామాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయాలని ఎంఈవో రామకృష్ణుడు అన్నారు. మంగళవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలకల పాఠశాలలో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి స్కిల్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో సెలెక్ట్ అయిన విద్యార్థినులు ఈనెల 7న జరిగే జిల్లాస్థాయి స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఫైనల్ హిమబిందు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నమండెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్రిచెరువు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచోటికి చెందిన దేరంగుల నాగరాజు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడు నాగరాజు వేంపల్లి నుంచి ద్విచక్రవాహనంలో రాయచోటికి వెళుతుండగా దొర్రిచెరువు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారని స్థానికులు తెలిపారు. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లె పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

పంచాయతీ కార్మికురాలి మృతికి సంతాపం

నందలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు కాకి జ్యోతి(57) మృతి పట్ల సర్పంచ్ జంబు సూర్యనారాయణ సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్య సమస్యలతో మంగళవారం మృతి చెందిన కాకి జ్యోతి మృతదేహానికి సర్పంచ్ నివాళులర్పించారు. దహన సంస్కార ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు

సుండుపల్లె, నవంబరు4(ఆంధ్రజ్యోతి): దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని ముడుంపాడు, మడితాడు, సుండుపల్లె, రాయవరం గ్రామ పంచాయతీల్లో ఆయన పర్యటించారు. అనంతరం స్వదేశీ వస్తువుల వినియోగంపై పోస్టర్లు ఆవిష్కరణ, బీజేపీ మండలం నూతన కార్యవర్గం ఏర్పాటు, చాయ్ పే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ వస్తువులను వినియోగించాలన్నారు. మన దేశంలో తయారయ్యే వస్తువులు వినియోగించడం వలన మనదేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీశ్, బీజేపీ మండల అధ్యక్షుడు రమణ గౌడ్, సీనియర్ నాయకులు వెంకట్రామరాజు, మహేశ్వర్‌రాజు, శివశంకరయ్య పాల్గొన్నారు.

మనదేశంలో తయారైన వస్తువులను ప్రోత్సహించాలి

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మనదేశంలో తయారయ్యే వస్తువులను ప్రోత్సహించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌కుమార్‌రాజు తెలిపారు. మంగళవారం బీజేపీ ఆత్మ నిర్భయ భారత్ వికసిత్ కార్యక్రమంలో భాగంగా బోయపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో మనందరం కలిసి భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠంగా, బలంగా నిర్మించాలని తెలిపారు. స్వదేశీయ వస్తు వినియోగాన్ని ప్రోత్సహించి మరింత ముందుకు సాగినట్లయితే మనదేశంలో నూతన పరిశ్రమలు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయి కుమార్‌రాజు, సురేంద్రరాజు పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన టీచర్

నందలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ నీలిపల్లెకు వెళ్లేదారిలో ఉన్న గౌతమ్ హైస్కూల్లో ఇద్దరు విద్యార్థులను ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు చితకబాదడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం మేరకు... ఏడో తరగతి చదువుతున్న పఠాన్ జైనాబ్ సుల్తానా, షేక్ నిహాల్‌బాషా హోంవర్కు చేయకపోవడంతో ఆగ్రహించిన టీచర్ తీవ్రంగా చితకబాదడంతో విద్యార్థుల చేతులకు గాయాలతో పాటు వాతలు పడ్డాయి. దీంతో తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ప్రశ్నించగా ఉపాధ్యాయురాలు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బాధితులు వాపోయారు. ఈ విషయం డీఈవో దృష్టికి తీసుకెళతామని తల్లిదండ్రులు తెలిపారు.



తీవ్రంగా కొట్టడంతో విద్యార్థిని చేతిపై ఏర్పడిన వాతలు

సమస్యలపై ఇన్‌చార్జి మంత్రికి వినతి

సుండుపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన సమస్యలపై ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు తెలిపారు. జిల్లా పర్యటన సందర్భంగా మంగళవారం రాయచోటికి వచ్చిన ఇన్‌చార్జి మంత్రికి సుండుపల్లె-రాయచోటి డబుల్ రోడ్డు, ఝరికోన కాలువల ఏర్పాటు, జీ. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలోని గంగన్నగారిపల్లెకు వెళ్లే రోడ్డు వర్షాల కారణంగా దెబ్బతిన్నదని మరమ్మతులు చేయించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, పీసీసీ సెల్ అధ్యక్షుడు సురేశ్, మాలేపాటి సురేశ్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

సుండుపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి గ్రామోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ కుర్వపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న చెన్నయ్య

రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెగుంట గిరిజనకాలనీలో తాగునీటి సమస్య ఉందని, వెంటనే అధికారులు పరిష్కరించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్‌పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిగె చెన్నయ్య కోరారు. మంగళవారం కన్నెగుంట గిరిజన కాలనీ లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ కాలనీలో సుమారు 250 కుటుంబాలు జీవిస్తున్నాయని, వీరందరికి ఒకేఒక తాగునీటి చేతిపంపు ఉందన్నారు. చేతిపంపు చెడిపోతే మాత్రం నీటి కోసం రైతు వ్యవసాయ భూముల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పలుసార్లు ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసినా ఫలితం లేదన్నారు. కన్నెగుంట గిరిజనకాలనీలో తాగునీటి సదుపాయాలు కల్పించాలని, సిమెంట్ రోడ్లు తదితర మౌలికమైన సదుపాయలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని మాధవరంపోడు అరుంధతివాడలో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాలకు గురైన స్థలాలను తొలగిస్తామని, దళిత, గిరిజనుల శ్మశానవాటికలను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కబ్జాలపై సర్వేలు నిర్వహించి గ్రామస్థులకు న్యాయం చేస్తామని తెలిపారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఇంటి స్థలాలు, శ్మశాన వాటికలకు సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, వీఆర్వో, సర్వేయర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దేవుని మాన్యం.. అన్యులకు ఆన్‌లైన్

పెనగలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతశింగనమల గ్రామంలో ఉన్న వామనమూర్తి స్వామిదేవాలయానికి సంబంధించి సర్వేనంబరు 458లో 1.39 ఎకరాల మాన్యం భూమి ఉంది. ఈ భూమిని ఇదే గ్రామానికి చెందిన చింతకాయల జయరామయ్య పేరిట ఆన్‌లైన్ చేసినట్లు పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డులో ఉందని మాజీ జడ్పీటీసీ ఎర్రి నరసింహులు తెలిపారు. ఈ విషయంపై వీఆర్వోను ప్రశ్నించగా తనకేమి తెలియదని, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న సమాచారమే ఇక్కడ పొందుపరుస్తున్నామని చెప్పారని తెలిపారు. ఈ సమాచారాన్ని దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన పరిశీలించి ఆ భూమి వామనమూర్తిస్వామి దేవాలయానికి సంబంధించినదని తెలిపారన్నారు. కాబట్టి ఆన్‌లైన్‌లో ఉన్న చింతకాయల జయరామయ్య పేరును తొలగించాలని ఫిర్యాదు చేసి వారం రోజులైనా ఎటువంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దారు అమరేశ్వరిని వివరణ కోరగా ఆ విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

శిబ్యాల పెద్ద చెరువులో చేప పిల్లలు

రాయచోటిటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల పెద్దచెరువులో రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం చేప పిల్లలను వదిలారు. ఇటీవల కాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో అన్ని చెరువులు నిండిన నేపథ్యంలో గ్రామస్థులతో కలిసి ఆయన లక్షకు పైగా వివిధ రకాల చేప పిల్లలను వదిలారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి చేపల పెంపకం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల మేలు కోరే ప్రభుత్వమని వివరించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను అభినందించిన ఏపీడీ

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలంలో జాబుకార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ పూర్తి చేసే ప్రక్రియలు గుట్టపల్లి రెడ్డివారిపల్లెకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు జగన్‌మోహన్, సూర్యకిరణ్ వందశాతం పూర్తి చేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు సాంకేతిక సహాయకులు లక్ష్మీదేవి, పవన్‌కుమార్‌రెడ్డిలను మంగళవారం ఏపీడీ మధుబాబు, ఎంపీడీవో కలీముల్లా బేగం అభినందించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. మండలంలో ఇప్పటి వరకు మొత్తం జాబ్‌కార్డుల్లో ఉన్న శ్రామికులు 14,271కి గానూ 11,570 మందికి ఈకేవైసీ చేయడంతో 81.12 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రెడ్డిజవహర్, ఈసీ వెంకటపతి, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎం బీసీ మీటింగ్‌కు హాజరు కావాలి : ఎల్‌డీఎం

ఓబులవారిపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు నెలలకోసారి జరిగే జేఎల్‌ఎం బీసీ సమావేశానికి నియోజవర్గ పరిధిలోని బ్యాంకు అధికారులు హాజరు కావాలని లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. మూడు నెలల కాలంలో బ్యాంకు డీఆర్డీఏల ద్వారా ప్రజలకు అందించే లోన్లు, ఆర్థిక ప్రగతి, అలాగే ప్రణాళికలపైన చర్చించడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకు సిబ్బందితో జరిగే సమావేశానికి ఓబులవారిపల్లె ఆర్థిక అక్షరాస్యత కేంద్రానికి సంబంధించిన కౌన్సిలర్లు కూడా హాజరు కావాలని ఎల్డీఎం ఆంజనేయులు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలి

రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోడూరు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆర్ఎంటీయూ (రెవల్యూషనరీ మార్క్స్ ట్రేడ్ యూనియన్) జిల్లా కన్వీనర్ దాసరి జయచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.21,000 ఇవ్వాలన్నారు. ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సు రూ.6000 ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు, యూనిఫాం, చెప్పులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సబ్బులు, నూనె, టవల్స్ తదితరవి పంచాయతీ వారు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు రాజేశ్, పెంచలమ్మ, పుల్లయ్య, వెంకటేష్, గజ, పెంచలయ్య, కృష్ణవేణి, కిశోర్, సుధాకర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కక్షా రాజకీయాలకు దూరంగా పాలన

- ప్రతీకార రాజకీయాలకు చంద్రబాబు వ్యతిరేకం
- కష్టపడి పనిచేస్తే మళ్లీ అధికారంలోకి వస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

రాయచోటి - నేతాజీ సర్కిల్ , నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కక్ష పూరిత రాజకీయాలకు దూరంగా ప్రభుత్వ పాలన సాగుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో రాయచోటి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసులు పెట్టించుకున్నాం. జైళ్లకు వెళ్లాం. కష్టాలు, ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నామన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చట్టం పరిధిలోనే పోరాడుదామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు పార్టీ కోసం కష్టపడిన వారు అధికారం వచ్చాక తగిన గుర్తింపు కోరుకోవడం సహజమని, అలాంటి వారిని పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. కొంత ఆలస్యం కావచ్చు తప్ప.. అందరికీ తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలియజేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన 90 శాతం పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో అభివృద్ధిని తీసుకొచ్చాం. పరిశ్రమలు రాబోతున్నాయి. పరిశ్రమలు వస్తేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడవలు, బల ప్రదర్శన కంటే, సంక్షేమకార్యక్రమాలు, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు. రామ్‌గోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేసిన సమయంలో అప్పటి అధికార పక్షం చేసిన తప్పులను ప్రజల ముందు ఉంచడం ద్వారానే విజయం సాధించినట్లు తెలిపారు. ప్రతిపక్షం మాదిరిగా మనకు సొంత చానల్, పత్రిక లేవన్నారు. కార్యకర్తల ద్వారా మౌత్ పబ్లిసిటీ ద్వారానే ప్రజల్లోకి మనం చేసిన కార్యక్రమాలు తీసుకెళ్లాలన్నారు. తెలుగుదేశం పార్టీలోకి ఎంత పెద్ద నాయకులు వచ్చినా, పోయినా, కేవలం క్షేత్రస్థాయి కార్యకర్తలు మాత్రమే శాశ్వతం అన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రతిపక్షంలో డైనమిక్‌గా ఉండటంతో పాటు పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పోరాటం చేసిన వ్యక్తి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించే విధంగా పనిచేయాలన్నారు.

స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ

డీఆర్సీ సమావేశానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో స్వాగతం పలికారు. అనంతరం స్టేట్ గెస్ట్ హౌస్‌లో పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పాఠశాలలకు పాకిన మత్తు.. !

- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

గుర్రంకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ హైస్కూల్ విద్యార్థులు మత్తు పదార్థాలతో హెచ్‌ఎంకు పట్టుబడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆరుగురు టెన్త్ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో మత్తు పదార్థాలు సేవిస్తుండగా ప్రధానోపాధ్యాయుడు వారిని పట్టుకున్నారు. కార్యాలయంలోకి పిలిపించుకుని విచారణ చేయగా, తాము గంజాయిని సేవించలేదని, సొల్యూషన్ వాడినట్లు తెలిపారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా, అప్పటికే సాయంత్రం కావడంతో పోలీసులు మరుసటి రోజు రావాలంటూ ఇళ్లకు పంపేశారు. నాలుగు నెలల క్రితం కూడా ఇదే ప్రాంగణంలో ఓ విద్యార్థి మత్తు పదార్థాలను సేవిస్తూ ఉపాధ్యాయులకు పట్టుబడ్డాడు. అప్పట్లో విషయం బయటకు రాకుండా నొక్కిపెట్టారు. కాగా, మంగళవారం పోలీసులు, హెచ్‌ఎం కలిసి విద్యార్థులకు మత్తు పదార్థాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ విషయమై ఏఎస్‌ఐ బొజ్జినాయక్ వివరణ కోరగా హెచ్‌ఎం తీసుకొచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. తల్లిదండ్రులను తీసుకురావాలని విద్యార్థులకు చెప్పి పంపాము. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులకు తెలిపి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

రాజంపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఊటుకూరు గ్రామానికి చెందిన కార్తికేయరాజు(32) అనే వ్యక్తి విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కార్తికేయరాజు రాజంపేట పట్టణంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తుంటాడు. సోమవారం రాత్రి ఊటుకూరు పొలాల్లో విషం తాగాడు, అపస్మారక స్థితిలో ఉన్న కార్తికేయరాజును గుర్తించిన స్నేహితులు, స్థానికులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆర్థిక కారణాలే అతని ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చునని స్థానికులు చెబుతున్నారు. రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

మద్యం దుకాణంలో యువకుడి మృతి



నరేశ్ మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగుతూ.. నరేశ్ (28) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని పోతులప్ప వీధికి చెందిన నాగరాజు, పద్మజ దంపతుల కు మారుడు నరేశ్ సెంట్రింగ్ పనులు చేసేవాడు. మద్యానికి బానిసైన ఇతను మంగళవారం పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగుతూ అక్కడే పడి పోయాడు. ఎంత సేపటికీ అతను కదలక పోవడం గమనించిన స్థాని కులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి తమ బృందం తో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నా భర్త మృతి అనుమానాస్పదం

- ఎస్పీకి ఓ మహిళ ఫిర్యాదు ● పోస్టుమార్టంకు డిమాండ్



మృతుడి భార్య శ్రీదేవితో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

రాయచోటి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భర్త మృతదేహాన్ని భార్యకు చూపకుండానే బంధువులు అంత్యక్రియలు నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రవిశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం. రవిశంకర్ అన్నారు. పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలం నూతన కాల్వ పంచాయతీ దేవవాండ్ల పల్లెకు చెందిన దేరంగుల ఆంజనేయులు (28) భార్య ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. మూడు రోజుల క్రితం భర్త అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందడంతో ఈ నెల 2న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని భార్య శ్రీదేవి అతనిని చూసేందుకు గ్రామానికి వచ్చింది. అయితే, అప్పటికే ఆంజనేయులు మృతి చెందడంతో అంత్యక్రియలకుసిద్ధం చేసిన బంధువులు మృతదేహాన్ని చూసేందుకు సైతం ఆమెను అనుమతించలేదు. ఈ విషయంపై ఆమె సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మంగళ వారం పౌరహక్కుల నాయకులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయులు మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నందున పోస్టుమార్టం చేయించాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా కీడా జట్ల ఎంపిక



చెస్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలిక జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అండర్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 14, అథ్లెటిక్స్, అండర్ 14, 17, 19 చెస్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 360 మంది క్రీడాకారులు హాజరు కాగా, ప్రతిభ కనపర్చిన వారిని ఎంపిక చేశారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో అండర్ 14, 17, 19 చెస్ చాంపియన్‌షిప్ పోటీలో ఈ జట్లు పాల్గొంటాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజ తెలిపారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు అన్సర్, అంజనప్ప, దిలీప్, భారతి, సుధాకర్, మోహన్, కరేశ్, కిరణ్, మురళీధర్, హరి, లత, వరలక్ష్మి, డివిజన్ స్థాయి కో-ఆర్డినేటర్స్ భద్రయ్య, సుధాకర్,బాటాజీ, దేవకమ్మలు పాల్గొన్నారు.

నదుల వద్ద జాగ్రత్తగా ఉండాలి

- దేవాలయాల్లో క్యూలైన్ పాటించాలి ● ప్రజలకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచన

రాయచోటిటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నమయ్య జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం ఒకప్రకటనలో కోరారు. నదీ స్నానాలు, దేవాలయాల సందర్శనల విషయంలో భక్తులు తప్పక పాటించాల్సిన నియమాలను ఎస్పీ విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా నదుల్లో ప్రవాహం ఉధృతంగా ఉందని, లోతు తక్కువ ఉన్న సురక్షిత ప్రాంతంలోనే స్నానం చేయాలన్నారు. సుడులు, ప్రమాదకర లోతు ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు. మహిళలు, భక్తులు ఒడ్డున నిలబడి మాత్రమే దీపాలు వదలాలని, గట్టు జారే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా నడవాలన్నారు. పిల్లలను ఒక్క క్షణం కూడా ఒంటరిగా వదలవద్దని, వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు నిశితంగా గమనించాలన్నారు. నదులు, దేవాలయాల వద్ద మీ భద్రత కోసం ఉన్న పోలీసుల సూచనలను తప్పక పాటించాలన్నారు. రద్దీగా ఉండే ఆలయాలు, ఘాట్ల వద్ద తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా క్రమశిక్షణతో క్యూలైన్లలో మాత్రమే వెళ్లాలని, గుంపులుగా వెళ్లవద్దన్నారు. పూజలు నిర్వహించే సమయంలో షార్ట్ సర్క్యూట్‌లు, దీపాల వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి ఇసుక, నీటిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అత్యవసర సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని పేర్కొన్నారు.

గైడ్ కెప్టెన్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ కే. సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలపై ఇచ్చే శిక్షణను గైడ్ కెప్టెన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం సూచించారు. రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన బేసిక్ గైడ్ కెప్టెన్ల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం స్కౌట్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై విద్యార్థులకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని, సేవా భావాన్ని, నైతిక విలువలను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధాకర్, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్ సుజాత, జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన 55 మంది బేసిక్ గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం



ఐసీడీఎస్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం

మదనపల్లె టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రొఖియా బేగం తెలిపారు. మంగళవారం మదనపల్లెకు వచ్చిన ఆమె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. పౌష్టికాహారం నివేదికలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాల వివరాలను మహిళా కమిషన్‌కు పంపాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లతో పలు అంశాలను చర్చించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగవేణి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు సమాజంలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే ధైర్యంగా టోల్‌ఫ్రీ నెంబర్‌కు, శక్తియాప్ ద్వారా పోలీసులకు తమకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం చంద్రాకాలనీలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వంటశాలలో కూరలను పరిశీలించారు. కోడిగుడ్ల బండి వద్ద విద్యార్థినులు ఉండటాన్ని చూసి ప్రిన్సిపాల్ మల్లీశ్వరిని ప్రశ్నించారు. స్కూల్ కమిటీలో విద్యార్థినులు సభ్యులుగా ఉన్నారని, అందుకే 8, 9 తరగతులు విద్యార్థినులు కోడిగుడ్ల లెక్కలను సరి చూస్తున్నారని అక్కడి అధ్యాపకులు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య, క్రీడల్లో ప్రోత్సాహం ఇవ్వాలని మహిళా కమిషన్ సభ్యురాలు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం వచ్చి మృత్యువాత..

- ఆందోళనతో గుండెపోటుకు గురై వృద్ధుడి మృతి



చంద్రారెడ్డి మృతదేహం

పీలేరు, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): భూతగాదాల నేపథ్యంలో న్యాయం కోసం పోలీసు స్టేషన్, తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన కూరపర్తివారిపల్లెకు చెందిన ఇట్లం చంద్రారెడ్డి(70) అనే వృద్ధుడు పోలీసు స్టేషన్ ఎదుటే మృత్యువాతపడిన సంఘటన మంగళవారం పీలేరులో చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు వెంకటేశ్వరరెడ్డి కథనం మేరకు .. చంద్రారెడ్డి కుటుంబానికి రేగళ్ల పంచాయతీ పరిధిలోని సర్వే నెం 284లో 2.96 ఎకరాల పొలం ఉంది. ఈ పొలం విషయంలో శెట్టిపల్లె హరిజనవాడకు చెందిన గంగారపు గంగయ్య, గంగారపు వెంకటేశు మధ్య వ్యాజ్యం నడవగా, పీలేరు సివిల్‌జడ్జి కోర్టు చంద్రారెడ్డి కుటుంబానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గత నెల29, 30 తేదీల్లో తమ పొలంలో ఉలవలు చల్లేందుకు ప్రత్యర్థులు చేసిన ప్రయత్నాలను అడ్డుకుని, పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో విచారణ నిమిత్తం మంగళవారం పోలీసు స్టేషన్ వద్దకు వస్తున్న చంద్రారెడ్డి, కుటుంబ సభ్యులపై ఎదుటి వర్గం వారు దౌర్జన్యం చేశారు. దీంతో ఆందోళనకు గురైన తన తండ్రి కుప్పకూలిపోయాడని, వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంకటేశ్వరరెడ్డి మంగళవారం సాయంత్రం తన ఫిర్యాదు వాపసు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి

గండి క్షేత్రంలో ప్రత్యక్షం

- సోషల్ మీడియా చిత్రాల ఆధారంగా గుర్తించిన భక్తులు



విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తంబళ్లపల్లె/రాయచోటి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు మందలిస్తారనే భయంతో నాలుగు రోజుల క్రితం తంబళ్లపల్లె గిరిజన బాలుర గురుకుల పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. . అక్టోబరు 31 తెల్లవారుజామునుంచి విద్యార్థి కనిపించడం లేదంటూ తల్లితండ్రుల ఫిర్యాదు చేయడంలో తంబళ్లపల్లె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ వెంకటేశులు, ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలతో గాలించడంతోపాటు, సీసీ కేమెరాల ఫుటేజీల పరిశీలన, విద్యార్థి ఫొటోలతో కూడిన కరపత్రాలను సోషల్ మీడియా, సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. మంగళవారం కడప జిల్లా వేంపల్లి గండి ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లిన ఓ భక్తుడు సామాజిక మాధ్యమంలో చూసిన పోలికలతో ఓ బాలుడు ఆలయం వద్ద ఒంటరిగా తిరుగుతుండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని విద్యార్థి చరణ్‌ను సురక్షితంగా పట్టుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

డ్రైవింగ్ శిక్షణకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ కోసం అన్నమయ్య జిల్లా అభ్యర్థులకు కడపలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి నేతృత్వంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జీవనోపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ మోటరువాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 12 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఎటువంటి పారితోషికం ఉండదన్నారు. శిక్షణ ఇచ్చినందుకు అభ్యర్థి తరఫున ప్రభుత్వం ఆర్టీసీ రూ.20 వేలు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టరు సుబ్బరాయుడు, ప్రజా ట్రాన్స్‌పోర్టు శాఖ (ఆర్టీసీ) అధికారి బాషా తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచుకోవాలి

- పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ విజయభాస్కర్



చూడి ఆవుకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచుకోవాలని రాజంపేట పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కేఆర్‌కండ్రికలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 253 పశువులకు గాను చూడి, సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దూడలకు నట్టల నివారణ మందుల వేశామన్నారు. పిడుదుల మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కేఆర్‌కండ్రిక, అమ్మిశెట్టిపల్లె, చియ్యవరం, కమ్మపల్లె, నడింపల్లె, వెంకటరెడ్డిపల్లె తదితర గ్రామాలకు చెందిన 55 మంది పాడి రైతులకు రూ. 20 వేలు విలువ చేసే మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌రాజు, కడప పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ శివరామిరెడ్డి, పశువైద్యులు దుర్గానాగమ్మ, డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ నాగ శిరీషా, డాక్టర్ సృజన, పాడి రైతులు శ్రీనివాసరాజు, మద్దిన గిరిబాబు, మండల పశుసంవర్ధక శాఖ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 69వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 1, 2 తేదీల్లో ఏలూరు లోని శనివారంపేట హైస్కూలు మైదానంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో రైల్వేకోడూరు జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థిని అఖిల బంగారు పతకాన్ని సాధించి, జాతీ య స్థాయి పోటీలకు ఎంపిక కాగా, మంగంపేట జడ్పీ హైస్కూలు విద్యార్థి ఏ. రామ్‌చరణ్ కాంస్య పతకాన్ని సాధించాడని ఎస్‌వీకే స్పోర్ట్స్ అకాడమి కోచ్ శివాజీ తెలిపారు. అఖిల ఈ నెల 25న అరుణాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థులను రైల్వేకోడూరు రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు అభినందించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



తరగతి గదిలో మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

సుండుపల్లె, నవంబరు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్న త లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని జేడీఏ శివనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని రాయవరం ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, వసతులు, విద్యార్థుల సమస్యలు , 9, 10 తరగతుల సిలబస్ ఏ మేరకు పూర్తి చేశారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోందని, అందుకు అనుగుణంగా రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. యూనిట్ టెస్టులు, వాటి ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అమ్మనాయక్ పాల్గొన్నారు.


నిధులు తెచ్చుకోవడంలో ప్రభుత్వం విఫలం

- తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడంలో కూటమి ప్రభుత్వం, గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. రాజధాని నిర్మాణం పేరుతో విచ్చలవిడిగా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చవద్దని ముఖ్యమంత్రికి ఆయన సూచించారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాజెక్టు సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నోమార్లు చెప్పారన్నారు. కానీ ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం రూ.31వేల కోట్లు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో నుంచి, జర్మనీ బ్యాంకు ద్వారా అప్పు చేశారన్నారు. ఇవి కాకుండా మరో రూ.32,500 కోట్లు అప్పు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం అప్పులు చేయడం మానుకుని కేంద్రప్రభుత్వం ఆర్థిక సహాయం, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో నిర్మించాలని ఆయన సూచించారు.

హార్సిలీహిల్స్‌లో హాయి హాయిగా...

- కొండను కమ్మేసిన పొగమంచు ● పర్యాటకులకు కనువిందు



పొగమంచులో హరిత రెస్టారెంట్ ప్రాంగణం

బి.కొత్తకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని హార్సిలీహిల్స్‌లో మంగళవారం నాటి దృశ్యాలు పర్యాటకులను కట్టిపడేశాయి. సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న హిల్‌స్టేషన్ కావడంతో సహజంగానే చల్లనిగాలులతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు పడే సూచనలుంటే కొండంతా పొగమంచు కమ్ముకుంటుంది. సమీపంలోని మనుషులు, ప్రదేశాలు కనపడనంతగా పొగమంచు ఆవరిస్తుంది. మంగళవారం ఇలాంటి వాతావరణం కొండమీద కనిపించింది. దీంతో కొండపైకి వచ్చిన పర్యాటకులు మంచును, వణికించే చలిని ఆస్వాదిస్తూ గడిపారు. గాలిబండ, కొత్తవ్యూపాయింట్ నుంచి దిగువ ప్రాంతాలు కనపడనంతగా కమ్మేసిన పొగ మంచులో ప్రకృతి అందాలను కెమెరాలలో బంధించారు. చక్కటి అనుభూతిని పొందుతూ కొండపై కలియ తిరిగారు.



దిగువప్రాంతం ఏరియల్ వ్యూపాయింట్

ఎడతెరిపి లేని వర్షం... తీరని నష్టం

నెల రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతున్నారు. మొన్నటి వరకు మొంథా తుఫాను ధాటికి రైతులు విలవిల్లాడారు. ఇప్పుడిప్పుడే ఊపిరి తీసుకుంటున్న పరిస్థితుల్లో తిరిగి వర్షాలు పడుతుండడంతో వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పంటలన్నీ కోత దశకు వచ్చి నూర్పిళ్లు జరుగుతున్న తరుణంలో వర్షాలు కురవడంతో చేతికి వచ్చిన పంటలు పొలాల్లోనే దెబ్బతింటున్నాయని తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు.


గుడిపాడు వద్ద వేరుశనగ పొలంలో నిలిచిన వర్షపునీరు

దువ్వూరు/రాజుపాళెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు, రాజుపాళెం మండలాల్లోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, మినుము, వరి, పత్తి, కంది, వేరుశనగ, పసుపు, ఉల్లి తదితర పంటలను రైతులు సాగు చేశారు. దాదాపు నెల రోజులు రోజూ వర్షం కురుస్తుండడంతో పంటలు సాగు చేసిన పొలాల్లో తేమ శాతం ఎక్కువై పురుగుల బెడదతో పాటు తెగుళ్లు చుట్టుముట్టాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. ఉల్లి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. చాలా గ్రామాల్లో వర్షానికి తోడు ధర లేకపోవడంతో చేసేది లేక పంటను పొలంలోనే వదిలేశారు. ప్రస్తుతం చిన్న బళ్లారి రకం ఉల్లి సాగు చేసిన రైతులు వర్షాలకు పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ వేసిన రైతుల పొలాల్లో నీరు నిలబడి పైరు కుచించుకుపోతోంది. పసుపు వేసిన రైతుల్లో సైతం వర్షం గుబులు పుట్టిస్తోంది. అక్కడక్కడ కాడ తెగుళ్లు సోకుతుండడంతో ఆందోళన రేకెత్తిస్తోంది. కానగూడూరు, క్రిష్ణంపల్లె ప్రాంతాల్లో పూలతోటలు పాడైపోయా యని రైతులు వాపోతున్నారు. ఇక మొక్కజొన్న దిగుబడులు రోడ్ల పక్కలో ఆరబెట్టిన రైతుల పరిస్థితి సరేసరి. కుప్పల్లో నీరు నిలువడంతో వాటిని తొలగించేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.


రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న విత్తనాలు


నీరు తొలగించేందుకు రైతు పాట్లు

వరి రైతుల్లో ఆందోళన

● వర్షం భయంతో ముమ్మరంగా వరి కోతలు


మిషన్‌తో వరి కోత కోస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షం భయంతో పండిన పంట ఎక్కడ దెబ్బతింటుందోననే ఆందోళనతో రైతులు గ్రామాల్లో వరి కోతలు మొదలు పెట్టారు. జమ్మలమడుగు మండలంలోని ధర్మాపురం, దానవులపాడు, గొరిగెనూరు, చలివెందుల, పెద్దదండ్లూరు, పి.సుగుమంచిపల్లె, అంబవరం, గూడెం చెరువు, అనంతగిరి, పూర్వపు బొమ్మేపల్లె తదితర గ్రామాల్లో ఏటా రైతులు అధికంగా వరి పంట సాగు చేస్తారు. ధర్మాపురం తదితర గ్రామాల్లో ఇటీవల తుపాను వలన వరి పంట నేలవాలి దెబ్బతింది. ప్రస్తుతం వర్షం భయంతో చేతికొచ్చిన పంట దెబ్బతింటుందోననే ఆందోళనతో రైతులు మిషన్లతో కోతలు ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో వరి కోతలు ఊపందుకున్నాయి. కాగా, పంట సాగు చేయడానికి ఎకరాకు రూ.35 వేలు ఖర్చు చేశామని, ప్రస్తుతం దిగుబడి ఉన్నా ధర లేదని ఓ రైతు వాపోయాడు. ఎకరాకు 38 బస్తాల నుంచి 42 బస్తాల వరకు వరి దిగుబడి వస్తోందన్నారు. ప్రస్తుతం వరి ధాన్యం 70 కిలోల బస్తా రూ.1400, పుట్టి (10 బస్తాలు) రూ.12వేలతో వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. సాగు కోసం చేసిన పెట్టుబడి, ఖర్చులు అన్నీ కలిపితే కష్టాలు తప్ప పెద్దగా మిగలడం లేదంటున్నారు. ప్రభుత్వం గిట్టు బాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.


వరిధాన్యం బస్తాలను లారీకి నింపుతున్న కూలీలు

గూడ్సు రైలుకింద పడి వ్యక్తి మృతి



కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని కనుమలోపల్లి వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి గూడ్సు రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు బ్లూకలర్ చొక్కాపై తెలుపు రంగు గీతలు కలిగిన ఫుల్ షర్టు ధరించి ఉన్నాడు. నలుపు రంగు కలిగిన ఫార్మల్ ఫ్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్‌ఐ 9440900811, సీఐ 9440627398 కు ఫోనుచేసి తెలపాలన్నారు.

భారీ స్కోర్ దిశగా అనంతపురం, నెల్లూరు జట్లు



కడప స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో మంగళవారం ఆట ముగిసే సమయానికి అనంతపురం జట్టు కర్నూలు జట్టుపై భారీ స్కోర్ దిశగా సాగుతోంది. నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు అదే దారిలో సాగుతోంది. వివరాలిలా.......


కడప నగర శివారు ప్రాంత కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం- కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 45 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 174 పరుగులు చేసింది. ముఖేష్ మోక్షజ్ఞతేజ్ 102 పరుగులతో, హేమచంద్ర్ నాయక్ 59 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. నగర రిమ్స్ సమీప వై.ఎస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 51.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. ఇందులో కిన్ను కిషల్ 77 పరుగులు చేశారు. మరో బ్యాటర్ ఎస్‌కె షామీర్ 26 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ రంగాల్లో ఏఐ పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఎయిర్‌ఫోర్సు టెక్నికల్ అడ్వైజర్ శ్రీనాథ్

కురబలకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ రంగాల్లో ఏఐ పాత్ర కీలకమని ఎయిర్ ఫోర్సు టెక్నికల్ అడ్వైజర్ శ్రీనాథ్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 'రోబోటిక్స్ డ్రోన్ టెక్నాలజీ రంగాల్లో ఏఐ పాత్ర' అంశంపై అవగాహన చేపట్టిన ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ప్రపంచ సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు నూతన సాంకేతికతలపై అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. రోబోటిక్స్ డ్రోన్ టెక్నాలజీల్లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతుందని, దీంతో పరిశ్రమలు, వ్యవసాయ, రక్షణ తదితర రంగాల్లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో అభివృద్ధిని సాధించవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ సంస్థలు ఈ రంగంలో పరిశోధన, శిక్షణ, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం ద్వారా దేశాన్ని ఏఐ ఆధారిత ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సాంకేతిర రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. విద్యార్థులు ప్రధానంగా సాంకేతికపై దృష్టి సారించి టెక్నాలజీలకు అనుగుణంగా పట్టు సాధించాలని దీంతో ఉజ్వల భవిష్యత్తును సాధించవచ్చన్నారు. సాంకేతికత, టెక్నాలజీపై పూర్తి స్థాయిలో నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

గుర్రంకొండకు 'ఎల్‌ఈడీ' శోభ



గుర్రంకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో హైవేపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు కాంతులు విరజిమ్ముతున్నాయి. హైవే పనుల్లో భాగంగా ఆరు నెలల కిందట రోడ్డుకు ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేసి వెలిగించడకుండా వదిలేశారు. ఈ క్రమంలో ఎల్‌ఈడీ లైట్లు వెలగలేదంటూ పలుమార్లు ప్రతికలో కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైవే అధికారులు లైట్లు వెలగడానికి కావాల్సిన టాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేసి లైట్లను సోమవారం రాత్రి వెలిగించారు. పట్టణాన్ని అంధకారం నుంచి విముక్తి కల్పించారని ప్రజలు, ప్రయాణీకులు ఆనందం వ్యక్తం చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న విజయభారతి సేతు

మదనపల్లె అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల అసక్తి పెంచుకుని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని విజయభారతి హైస్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ సేతు అన్నారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించుకోవచ్చన్నారు. విజయ భారతి హైస్కూల్‌లో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు హరినాథ్ శర్మ మాట్లాడుతూ 35 ఏళ్లుగా విద్యార్థుల్లో సైన్స్‌పట్ల ఆసక్తి పెంచడానికి 8,9,10 తరగతుల వారికి పోటీపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. స్కూల్ స్థాయిలో 4 వేల మంది పోటీ పరీక్షలు రాయగా అందులో 39 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వివేకానంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి 35 మార్కులు సాధించి మొదటి స్థానం, బాపూజీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి 26 మార్కులతో రెండో స్థానం, మరో కేటగిరిలో 35 మార్కులతో విజయభారతి ఇంగ్లీమ మీడియం హైస్కూల్ ప్రథమ స్థానం, 25 మార్కులతో జ్ఞానోదయ హైస్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. మొదటి స్థానం విజేతకు రాయచోటిలో జిల్లా స్థాయి పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులను మెమెంటోలు, సర్టిఫికెట్స్ మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు చంద్ర, పట్టణ కన్వీనర్ జీవీ ప్రసాద్, విజయభారతి ప్రిన్సిపాల్ నిశ్చల సేతు, ఉపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి, రవి, పార్వతి, సుధాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం


రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

ములకలచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోనేటివారిపల్లె రోడ్డు మరమ్మతు పనులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మట్టి రోడ్డు గుంతలమయం కావడంతో వర్షం వస్తే గ్రామానికి రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు, టీడీపీ నేతల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ క్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా చొరవ తీసుకుని రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్నారు. రోడ్డుపై మట్టి తోలించి ఎక్స్‌వేటర్‌తో చదును చేయించారు.

ఉద్యోగుల పనితీరు మెరుగుపడాలి

నిమ్మనపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల పనితీరు మెరుగుపడాలని ఎంపీడీఓ రమేష్ సూచించారు. మంగళవారం సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆయన హాజరు పరిశీలించి ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పీజీఆర్‌ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని తెలిపారు.

సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వాలి

● ఆర్‌ఎంపీలకు ఆర్డీఓ, వైద్య అధికారుల ఆదేశాలు


మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొద్దీన్

పులివెందుల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మీరు ఎంబీబీఎస్ చదవలేదు.. ఆస్పత్రుల్లో పని చేర్చుకుని వచ్చారు. ప్రథమ చికిత్స కేంద్రం అని ఏర్పాటు చేసుకున్నారు ప్రభుత్వ విధి విధానాల ప్రకారం రోగులకు సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొద్దీన్, డీఈఎంఓ భారతి ఆర్‌ఎంపీలను ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయంలో పులివెందుల, వేంపల్లెలోని ఆర్‌ఎంపీలతో (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) వారు మాట్లాడుతూ ప్రథమ చికిత్స కేంద్రాల్లో ఇంజక్షన్లు, మందులు, మాత్రలు ఇవ్వకూడదన్నారు. ఐవీ ఫ్లూయిడ్స్, స్టెరాయిడ్లు, యాంటీబయాటిక్ మందులు ఇవ్వకూడదన్నారు. మంచాలు, ఐవీ స్టాండ్స్, ఆస్పత్రి పరికరాలు ఉండరాదన్నారు. ఆక్సిజన్ నెబులైజర్ ఉపయోగించకూడదన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో ప్రథమ చికిత్స గాయాలకు కట్టు కట్టుట, వ్యాధులు రాకుండా సలహాలు, సూచనలు, చికిత్సకు వెళ్లాల్సిన ప్రభుత్వ ఆస్పత్రిని సూచించడం జరుగుతుందనే బోర్డును డిస్ప్లే చేయాలని సూచించారు. ప్రథమ చికిత్స కేంద్రాల పర్యవేక్షణకు నోడల్ అధికారులు ఉంటారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఆర్‌ఎంపీలు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవచేస్తున్నారనే కోవలో ఎందుకు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో తప్పు జరిగితే అది అందరిపై రుద్దడం సరికాదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి తాము ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని, తమపై దయతలచాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రమణ, హెచ్‌ఈఈఓ రమణమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయ దేవస్థానానికి రూ. లక్షా 5 వేలు విరాళం


ఆలయ చైర్మన్‌కు విరాళం అందిస్తున్న దృశ్యం తిరుపాల్‌రెడ్డి

రాజుపాలెం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ సంజీవరాయస్వామి దేవస్థానానికి మంగళవారం మైలవరం మండలం నవాబుపేట వాసి భూపతి తిరుపాల్‌రెడ్డి రూ.లక్షా 5వేలు విరాళం అందజేశారు. నూతనంగా ఆలయం నిర్మిస్తుండడంతో దాతలు విరాళాలు అందిస్తున్నారని ఉత్సవ కమిటీ చైర్మన్ గంగిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. సంజీవరాయస్వామి సన్నిధిలో దాతను పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో పూజారులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి స్థలం ఆక్రమించరాదు


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

గుర్రంకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తరిగొండ బస్‌స్టాండులో కొలువైన మొగసాల గంగమ్మ అమ్మవారి స్థలం ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం అమ్మవారి స్థలం ఆక్రమణలను అధికారులు పరిశీలించారు. ఇందులో భాగంగా సర్వే నెంబరు 791లో పదుల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ స్థలంలో మొగసాల గంగమ్మ ఆలయం ఉంది. ఆలయం చుట్టూ ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకోవడంతో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు ఆక్రమణలను పరిశీలించి ప్రభుత్వ స్థలంలోకి ప్రవేశించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి : చల్లపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న చల్లపల్లి నరసింహారెడ్డి

బి.కొత్తకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆ పార్టీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీజేపీ పాత్ర కీలకమని, రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు బీజేపీ రాష్ట్రానికి చేస్తున్న సహాయ సహకారాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ పటిష్టతకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, మండల కన్వీనర్ ముకుందబాబు, మురళి, కార్తీక్, రాము, రంగారెడ్డి, రాజారెడ్డి, గుట్టపాళ్యం నరసింహారెడ్డి, శీతారామిరెడ్డి, షౌకత్, ముబారక్ పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

పెద్దమండ్యం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు సూచించారు. బండమీదపల్లి పంచాయతీ తురకపల్లి గ్రామంలో 104 వాహన వైద్య సేవలు తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ గామాల్లో సంచార వైద్య సేవలందిస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, దీర్ఘకాళిక రోగులకు ఈ వైద్య సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. పెద్దమండ్యం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం పరిశీలించారు. పిల్లల వివరాలను అడిగి తెలుకున్నారు. తల్లీపిల్లలకు మంచి ఆహారం అందించాలన్నారు. ప్రభుత్వం నింబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కృష్ణవేణి, స్వప్న, రెడ్డప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి రండి

మంత్రి, ఎమ్మెల్సీలకు ఆహ్వానం

మదనపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో 13న జరిగే మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రావాలని మంత్రి, ఎమ్మెల్సీలను మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం ఆహ్వానించారు. జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరితో కలిసి జంగాల శివరాం మంగళవారం మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌ను కోరారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శాసనమండలి విప్, ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, రూరల్ అధ్యక్షుడు మహేష్‌బాబు ఉన్నారు.


ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను ఆహ్వానిస్తున్న జంగాల శివరాం, రామ్‌దాస్‌చౌదరి

జోగి బ్రదర్స్ అరెస్టుపై రాద్ధాంతం తగదు

మదనపల్లె టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసు నిందితులతో సంబంధాలున్న జోగి బ్రదర్స్‌ను పోలీసులు అరెస్టు చేయడంపై వైసీపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మండిపడ్డారు. మంగళవారం నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం కేసులో పక్కా ఆధారాలతోనే పోలీసులు అతన్ని అరెస్టు చేశారన్నారు. జోగి రమేశ్ ఆదేశాల మేరకే జనార్ధన్‌రావు ములకలచెరువు, ఇబ్రహీం పట్నంలో కల్తీ మద్యం తయారు చేశారన్నారు. ములకలచెరువు వద్ద కల్తీమద్యం కేసులో తంబళ్లపల్లె టీడీపీ మాజీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డిని చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. కానీ కల్తీ మద్యం కేసులో ప్రమేయమున్న జోగి రమేశ్‌ను వైసీపీ అధ్యక్షుడు జగన్ ఎందుకు సస్పెండ్ చేయడం లేదని ప్రశ్నించారు. తన తప్పు కప్పిపుచ్చుకోవడానికి జోగిరమేశ్ అతని కులస్థులను రెచ్చగొడుతున్నాడన్నారు. టీడీపీ నేతలు అన్వర్‌బాషా, రాజన్న, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

రామాయణంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు


రామాయణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ వ్యాపారవేత్త గుత్తా హరికృష్ణ

మదనపల్లె అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో 2026 జనవరి 22న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు శ్రీరామచంద్రుడి గుణగణాలు పరిచయం చేయడమే లక్ష్యంగా రామాయణంపై పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రముఖ వ్యాపారవేత్త గుత్తా హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పుస్తకం తెలుగు, ఇంగ్లీషు బాషల్లో అందుబాటులో ఉందన్నారు. ప్రతి స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. పిల్లల్లో శ్రీరాముని సద్గుణ విలువలు, మానవీయ కోణంలో అర్థం అయ్యేలా అవగాహన పెంపొందించడానికి దోహదపడుతోందన్నారు. ప్రాంతీయ కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు గట్టి రామ్మోహన్, కార్యదర్శి సొంపల్లె సురేష్, కార్యకర్తలు హిందూ బంధువలు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి

ములకలచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ హరినారాయణ, ఎంఈఓ వెంకటరమణ సూచించారు. సోంపల్లె జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మై స్కూల్...మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా టెన్త్ విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వత్తిడికి గురికాకుండా బాగా చదివి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేడు లక్షదీపారాధన

- వేడుకగా కార్తీక పౌర్ణమి
- మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు
- గరుడ పుష్కరిణిలో...
- వాల్మీకిపురంలో ఆయుత దీపోత్సవం

నిమ్మనపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తవళం అటవీ ప్రాతంలో వెలసిననేలమల్లేశ్వస్వామి ఆలయంలో లక్షదీపారాధన నిర్వహించనున్నట్లు ఈఓ మంజుల తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కార్తీక మాసంలో భక్తులు నిత్యం నోముల నోచుకునేందుకు ఆలయానికి అధిక సంఖ్యలో వస్తున్నారన్నారు. బుధవారం ఉదయం నేలమల్లేశ్వస్వామి కళ్యాణోత్సవం, మధ్యాహ్నం రథోత్సవం, సాయంత్రం లక్ష దీపోత్సవం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకో నున్నారు. ఇందులో భాగంగా ఈఓ మంజుల, ఎస్‌ఐ తిప్పేస్వామి, ఆలయ కమిటీ సభ్యులు గుడి వద్ద పనులను పర్యవేక్షించారు.



మల్లయ్యకొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు - ముస్తాబైన లక్ష్మీకామేశ్వరస్వామి (వాల్మీకిపురం)

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండకు పౌర్ణమికి ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి తెలిపారు. మహిళలకు ఉచితం, మిగిలిన వారికి సాధారణ చార్జీలు ఉంటాయన్నారు. ఉదయం 5 గంటలకు, 5.45, 6.30కు మదనపల్లె బస్‌స్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు బయలు దేరుతాయన్నారు.

వాల్మీకిపురంలో ఆయుత దీపోత్సవం

వాల్మీకిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో ఆయుత దీపోత్సవం, లక్ష దీపారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాల్మీకిపురంలో పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జగనున్నాయి. స్థానిక కోనేటి వీధిలోని లక్ష్మీ కామేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరగనున్నాయి. సాయంత్రం జ్వాలా తోరణం, చేస్తారన్నారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద ఆయుత దీపోత్సవం, భక్తుల ఆధ్వర్యంలో కోనేరు వద్ద కార్తీక లక్ష దీపారాధన జరగనున్నాయి. భక్తులు పాల్గొనాలని అర్చకులు గోనవరపు శీనాస్వామి కోరారు. పాలిమేరల్లోని సమూహాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలియ జేశారు.

సోమేశ్వరాలయంలో...

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పుల్లారెడ్డి, ప్రధాన అర్చకులు రామచంద్ర శాస్త్రి, శివకుమార్ శాస్త్రి చెప్పారు. ఉదయం మహన్యాస రుద్రాభిషేకం, సాయంత్రం ధ్వజస్థంభానికి కవచ సంప్రోక్షణ, సహస్ర దీపాలంకరణతో దీపారాధన, చివరగా జ్వాలా దర్శనం తరువాత సర్వదర్శనం జరుగుతాయన్నారు. అన్నప్రసాదాల వితరణ ఏర్పాటు చేశామన్నారు. భక్తులు విశేషంగా హాజరై స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

సత్యనారాయణ స్వామి ఆలయంలో...

మదనపల్లె అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని చిన్న చిట్టివరం సత్యనారాయణ స్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు అమరనాథ్ తెలిపారు. ఉదయం నుంచి కార్తీక పౌర్ణమి పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం దామోదర పూజ, అనంతరం మహామంగళ హారతి ఉంటుందన్నారు. రాత్రి 7 గంటలకు లక్షదీపోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సీటీఎంలో రుద్రాభిషేకం

సీటీఎం కాశీవిశ్వేశ్వర స్వామిఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, చార్టెర్డ్ అకౌంటెంట్ పీఎస్ చైతన్య, అర్చకుడు కుమార్ శర్మ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం ఉంటుందన్నారు.

కష్టపడ్డ వారికే పదవులు ఇవ్వాలి


పల్లా శ్రీనివాసరావుకు సమస్యను వివరిస్తున్న టీడీపీ నేత సోముశేఖర్

తంబళ్లపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారిని గుర్తించి పదవులు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సోముశేఖర్ కోరారు. విజయవాడ టీడీపీ కార్యాలయంలో సోమవారం పల్లాను కలిసి వినతి పత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు కేసులు, దాడులు ఎదుర్కొని టీడీపీ విజయానికి కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు టీడీపీలో చేరి పదవులు పొందడానికి ప్రయత్నిస్తున్నారని వివరించారు. టీడీపీలో కష్టపడ్డ కార్యకర్తల కు ఎల్లపుడు సముచిత స్థానం లభిస్తుందని దీనిపై ఎటువంటి సందేహం లేదని పల్లా శ్రీనివాసరావు సోముశేఖర్‌కు హామీ ఇచ్చారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

మదనపల్లె టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సమాజంలో అక్కడక్కడా వెలుగు చూస్తున్న బాల్య వివాహాలను అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమష్టిగా నిర్మూలించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో డీవైఈఓ లోకేశ్వరరెడ్డి, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూఓ గంగిరెడ్డి మహిళా కమిషన్ సభ్యురాలిని కలిశారు. ఫోర్డు స్వచ్ఛంద సంస్థ రూపొందించిన బాల్య వివాహాలను నిర్మూలిద్దాం కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం నేరమన్నారు. కార్యక్రమంలో ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ, సీడీపీఓ నాగవేణి, ఏసీడీపీఓ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబైన శివాలయాలు



పీలేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి దీపారాధన ఉత్సవాలకు మండల పరిధిలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. బ్రాహ్మణ వీధిలోని శివాలయం, దొడ్డిపల్లె పంచాయతీ శివరామాపురంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, చెన్నకేశవ స్వామి ఆలయం, వేపులబైలు పంచాయతీ జంగం పల్లెలోని వీరభద్రస్వామి ఆలయాలను ఆయా ఆలయాల నిర్వాహకులు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

నేడు సమస్యల పరిష్కార వేదిక

తంబళ్లపల్లె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు పేర్కొన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరు చల్లా కళ్యాణి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారం పొందాలని ఒక ప్రకటనలో కోరారు.

వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం

వాల్మీకిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భారతీయులంతా స్వదేశీ వస్తువులనే వాడితే భవిష్యత్తులో వికసిత్ భారత్ సాకారం అవుతుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి విష్ణుచైతన్య అన్నారు. మంగళవారం బీజేపీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శక్తి కేంద్రాల నియామకం, మండల పోలింగ్ బూత్ నిర్వహణ, కార్యనిర్వాహక నియామకాల పట్ల సభ్యులతో చర్చించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శక్తి కేంద్రాలు, పోలింగ్ బూత్ నియామకాలు చేపట్టాలన్నారు. స్థానిక నేతలతో కలిసి ప్రతి ఇంటా స్వదేశీ స్టిక్కర్లను అంటించే కార్యక్రమం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణ, బొక్కసం రామకృష్ణ, ఆనంద్, సాంబశివ, అంజి, కుమార్, గౌతమ్, చందు, రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

'బీసీలకు ఆదరణ3.0 పథకం'

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీల కోసం త్వరలో ఆదరణ 3.0 పథకం రానుందని రాష్ట్ర జంగం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ వెల్లడించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మరుగున పడిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరించేందుకు రూ. వేయి కోట్లు కేటాయించినట్లు ప్రకటించడం బీసీ కులాల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిరాదరణకు గురైన ఆదరణ పథకం ఊపిరిపోసుకోవడం బీసీలకు శుభ పరిణామమన్నారు. ఈ పథకం అమలు కోసం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత శుక్రవారం బీసీ కార్పొరేషన్ చైర్మన్లతో బీసీ భవన్‌లో అభిప్రాయ సేకరణ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆదరణ 3.0 పథకంలో బీసీల కుల వృత్తులకు ఆసరాగా నిలిచేందుకు ఆధునిక పరికరాలు పనిముట్లు సరఫరా చేసి, ఆర్థిక తోడ్పాటందించాల్సి వుందని చెప్పారు. బీసీ కులాలకు కావలసిన పథకాల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావలసి వుందని అభిప్రాయపడ్డారు. శుక్రవారం మంత్రితో జరిగే సమావేశంలో ఈ పథకాలను ప్రతిపాదించి నిధుల కేటాయింపునకు కృషి చేస్తానని చంద్రశేఖర్ వివరించారు. శుక్రవారంలోగా 96525 83149, 84980 34901 నంబర్ల ద్వారా తనకు తెలియజేయాలని కోరారు.

బాధ్యతగా పని చేయండి

పెద్దమండ్యం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన వెలిగల్లు సచివాలయ సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. వన్‌బీ, జనన, మరణ వివిధ ధృవ పత్రాల్లో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఆదాయం పెంచాలన్నారు. స్వమిత్వ, కౌశ్యల సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి పనుల వివరాలు ఆయా శాఖల వద్ద అందుబాటులో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌బాష, జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'అత్యవసర సమావేశం ఏర్పాటు చేయండి'

ములకలచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ అత్యవసర సమావేశాన్ని మూడు రోజుల్లోగా ఏర్పాటు చేయాలని ఎంపీపీ సాయి లీల, వైసీపీ ఎంపీటీసీలు అయిషా, రేష్మా, కృష్ణమూర్తి తదితరులు మంగళవారం ఎంపీడీఓ హరి నారాయణకు వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని కొన్ని శాఖల్లో నిధులు దుర్వినియోగమైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వీటిపై స్పష్టత, పారదర్శకత కోసం మండల సమావేశం అత్యవసరంగా ఏర్పాటు చేయాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, జడ్పీ ఫండ్ వివరాలు, మండలంలోని అన్ని పంచాయతీలకు కొత్తగా ఇచ్చిన లే అవుట్ అనుమతులు, అనధికార లేఅవుట్ల వివరాలు తదితర అంశాలపై చర్చించేందుకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, సభ్యులందరూ హాజరయ్యేలా చూడాలని కోరారు. తక్షణం చొరవ తీసుకున్న ఎంపీడీఓ ఈ నెల7వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.